


894.8271
ELL

C·I

AouA 1013 108 B

# రేపటి వసంతం

(కవితా సంపుటి)

ఎల్లోరా

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10315

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No. 10315

శ్రీనివాస ప్రచురణలు
63, వి. ఆర్. పిళ్ళై స్ట్రీట్
మద్రాసు - 5

I

REPATI VASANTHAM

An Anthology Of Poetry

By

ELLORA

894.8271
ELL

First Edition 1974

Wrapper Design By BAPU

Price Rs. 5-00

*Published By*

© SRINIVASA PUBLICATIONS
63, Venkatarangam Pillai Street,
MADRAS-600 005.

ALSO
COPIES AVAILABLE FROM :

1. Andhra Pradesh Book Distributors,
   Rashtrapathi Road, Secunderabad-3.
2. M. Seshachalam & Co., Madras-1.
3. Navodaya Publishers, Eluru Road, Vijayawada-2.
4. Visalandhra Prachuranalayam, Eluru Road, Vijayawada-.2

PRINTED AT KRANTI PRESS, MADRAS-1.



# అంకితం

కవులకు గుండెలో
　　చోటిచ్చువాడు
కళలకు అండగా
　　నిలుచువాడు
నాకు కైదండగా
　　అన్నలా ఉన్నవాడు
మా "రాజా" కు మిక్కిలి
　　ప్రేమతో

—ఎల్లోరా

# కవి పలుకులు

కాలాన్నిబట్టి కవితా వస్తువు మారక తప్పదు. కాలానుగుణమైన భావాలు, పదప్రయోగాలు ఆవిర్భవించక మానవు. విశ్వమానవ పరిణామంతోబాటు కవితా లక్షణం కూడా పరిణామం చెందుతూంది—చెందక తప్పదు. సాహిత్యం పరిణామశీలి.

నేడు గేయకవులు తమ జీవితాల్లోని విచిత్రానుభూతుల్ని, రసవత్తర సన్నివేశాల్నీ కలిపి రచనలు చేస్తున్నారు. కవిత్వానికి పనికిరాని దేదీ లేదు.

నవ్య కవితా మార్గంలో పయనించే కవిని సంఘం అడుగడుగునా కవ్విస్తుంది, కవితాగానం చేయిస్తుంది. కవిత్వంలో ఆత్మనీ, ఆవేదననీ ప్రస్ఫుటీకరించి, స్పందింపజేసే తత్త్వం ఎంతగా ఉంటుందో, అది సత్యం, శివం, సుందరంలను మరెంతగా వినిపిస్తుందో అంత ఎత్తున కవిత్వం ఎదుగుతుందనీ, శాశ్వతత్వాన్ని పొందుతుందనీ నమ్మేవాళ్ళలో నేను ఒకడిని.

ఛందస్సూ, వ్యాకరణ సూత్రాలూ కవిత్వంకాదనీ, జీవితాన్ని, సంఘాన్ని వినిపించే భావచ్ఛందాలలోనే ఉత్తమ కవితాగానం చేయవచ్చనీ, ఉత్తమ సాహితీ సందేశం అందివ్వవచ్చనీ నా నమ్మిక; ఆశయం.

గుండె నిండుగా వసంతం పండి పలకాలనే నా ఆశకు, విశ్వమానవ కళ్యాణ ప్రాప్తికి నాందీ ప్రస్తావన జరగాలనే ఆశయానికి ఇది దర్పణం.

కవిత సుందరంగానూ ఉండాలి; ప్రబోధాత్మకమూ కావాలి. స్మృతుల్ని సుందరంగా గానం చేయించాలి. జీవిత సమస్యలను ధ్వనులుగా నినదించాలి. అప్పుడే కవి ఆశయం, కవితా ధర్మం నెరవేరుతాయి.

సుకవితా యద్యస్తి రాజ్యేన కిం?

63, V. R. PILLAI ST.,
MADRAS-5

ఎల్లోరా

## శ్రీరస్తు

'ఎల్లోరా' నీ కివె
   నా చల్లని దీవెనలు
నీ ప్రసన్న కవిత్వోత్ఫుల్ల
సుమమ్ములు
రసికుల ఉల్లమ్ములలోన
రసము లూర్చున్ గాతన్.

మనుజుల మనసులలో
మంచిని పెంచిన కొలది,
వారి జీవితముల
నీతిని నించిన కొలది
జగమ్మున శాంతి లభించు
కలము పోనిమ్మిటులే.

ఎదలను కదిలించిన జా
లదియే పదివేలు,
వాని నార్ద్ర మొనర్చున్
పదిలమగు మానవత;
అల్లదియె ఆశింపవలయు
నపు, డిపు, డెపుడున్.

మనసున్నవాడు
బాధల గని
ఊఅక ఉండలేడు,
కన్ను చెమర్చున్
తన తోడివారిలో

V.R. NARLA MEMORIAL LIBRARY ★
V.R.NARLA
D.R.R.I.
Acc. No.

పెరిమను చిప్పిల జేయజూచు
మాటల గూర్చున్
ఆ మాటల కూర్పున
నేదో మాయాజాల మల్లి
తొలకించు
కవిత్వామృతమును కవి,
లక్ష్యమ్మీ మనిషిని
కొంత ఎత్తు ఎదిగించుటయే.

అడుగున బడిన జనమ్ముల
బడుగున్ బ్రదుకులను
కొంత బాగుపరుప
గుప్పెడు మంచితనము నిల
పంచెడు నీ కవితకు
జయోస్తు, శ్రీరస్తు సదా.

మదరాసు
17-6-74

—విద్వాన్ విశ్వం

# ఉపోద్ఘాతం

"నదీం పుష్పోడుప వహాం' అని ఒక వాక్య శకలం. దీని అర్థం పూలపడవలు మోసే నది అని. మరింత విపులంగా చెపితేగానీ ఈ శకలంలో సౌరభం బాగా గుబాళించదు. అరవిరిసిన మొగ్గల్లాంటివి కవుల మాటలు; విరిసిన పువ్వుల్లాంటివి వ్యాఖ్యాతల మాటలు. (ఇవి నేను మంచి కవుల్ని, మంచి వ్యాఖ్యాతల్ని ఉద్దేశించి చెపుతున్న మాటలు). వెనకటి ఆ చిన్నమాటను వివరించడానికి మనం ఒక మాటల సమూహం తెచ్చుకోవాలి. "గట్లమీది చెట్లు రాల్చిన పువ్వులు పడవల్లా తమ ప్రవాహాల్లో తేలి పోతున్న నదులు" అని చెపితేగానీ మొత్తం కవి ఉద్దేశించిన ఆ అందమైన చిత్రం ఆవిష్కరింపబడదు. కానీ చిత్రాన్ని ఆవిష్కరించిన ఈ మాటల గుంపు కవిత్వం కాదు. పూలపడవలు మోసే నదులు అన్నప్పుడే కవిత పుడుతోంది. పూలపడవలు అన్నప్పుడు శీర్షోదయమూ, మోసే నదులు అన్నప్పుడు గుండెకాయతో సహా మొండెమూ ఉద్భవిస్తున్నాయి. పూలు, పడవలు, నదులు అన్న వస్తువుల్లోగానీ, వాటిని చెప్పే శబ్దాల్లో గానీ కవిత్వం లేదు. ఆ శబ్దాలతో కవి ఒక సృష్టి చేస్తాడు. ఆ సృష్టే కవిత్వం. Graham Hough అనే ఒక గొప్ప సాహిత్య శాస్త్రజ్ఞుడు తన Symbolismలో అన్న మాటలు గుర్తుకొస్తున్నాయి—"There is no reality for man until he has created it in symbolic form. Art is one of the systems of symbolic forms."

తెలుగు దేశంలో ఈ నాడు ఒట్టి పూలు, పడవలు, నదులు అనే శబ్దాలు రాసి ఇదే కవిత్వం అంటున్నారు, అనుకుంటున్నారు. కానీ వెనక చెప్పిన జీవభూతమైన సృష్టి అందులో లేదు. మరి ఏమిటీ సృష్టి? జగన్నాథుడని ఒక పాతకాలపు పండితు డున్నాడు. అత డన్నాడు: "పుత్రస్తే జాతః, ధనం తే దాస్యామి ఇతి వాక్యార్థ ధీ జన్యస్య ఆహ్లాదస్య న లోకోత్తరత్వం. అతః న తస్మిన్ వాక్యే కావ్యత్వ ప్రసక్తిః". అంటే తా॥ కొడుకు పుట్టాడు. నీకు డబ్బిస్తున్నాను అనే వాక్యాలు ఆనందం కలిగించేవే అయినా వాటిలో కవిత్వం లేదు. మరి ఎందులో ఉంది? అంటే, ఆయన చెపుతాడు: "చమత్కార జనక భావనా విషయార్థ ప్రతిపాదక శబ్దత్వం"లో ఉంది. అంటే—ఏ శబ్దం దాని అర్థాన్ని మనచేత మాటిమాటికీ ఆలోచింపజేసి అట్టి ఆలోచనా పౌనఃపున్యంచేత ఒక చమత్కా-

రాన్ని ఉత్పన్నం చేస్తుందో, అట్టి ఏ చమత్కారం ద్వారా లోకోత్తరాహ్లాదం కలుగుతుందో ఆ శబ్దమే కావ్యం. వట్టి మాటల్లో ఈ చమత్కారం లేదు కనుక, దాన్ని కలిగించడమే అక్కడ చేయవలసిన పని గనక, ఆ పని కవి చేస్తాడు గనక ఆ పనిని కవిత్వం అంటారు. ఆ పనే సృష్టి (తత్పూర్వం లేనిది తర్వాత వచ్చినది). మన Graham Hough గారి అభిప్రాయం కూడా "సరిగ్గా" ఇంతే. దాన్నే మరొక చోట ఆయన వివరించిన వాక్యాలు చూస్తే ఇది విశదం అవుతుంది—"Art does not imitate the external world. It only expresses the feelings of the artist."

వట్టి సామాన్య వాక్యాలు కవిత్వం కానే కావు. వట్టి శబ్దాలు, అర్థాలు కవిత్వం అవవు. కనక కవిత్వం శబ్దార్థజ్ఞాన మాత్ర పాండిత్యంచేత అర్థం చేసుకోలేరు. మహాకవిత్వాన్ని కూడా పాఠశాలల్లో, కాలేజీల్లో ఒక పాఠ్యైక మాత్రస్థాయికి దింపుతారు. ఆ క్లాసురూములో అది పాఠం మాత్రమే (ఆ లెక్చరర్లు పాఠాలు చెప్పే వాళ్ళు మాత్రమే; సాహిత్య వేత్తలు కారు) కనక అక్కడ టీకా తాత్పర్యాలు చెపుతారు. నిజంగా కాలేజీల్లో సాహిత్య బోధనే చెయ్యవలసి ఉంటే శబ్దార్థాలు కాదు చెప్పవలసింది. సాహిత్యం చెప్పాలి. సాహిత్యం ఎలా సృష్టించాలో చెప్పాలి. అది జరగడం లేదు. అట్టి సమర్థుల్లేరు దాన్ని అక్కడ చెప్పడానికి. కానీ వాళ్ళు సాహిత్య విమర్శలు రాస్తున్నారు. కవుల అదృష్టరేఖల్ని దిద్దుతున్నారు. అదలా ఉంచుదాం. మరి శబ్దార్థాలు సాహిత్యం కాకపోతే ఏది సాహిత్యం అంటే, దానికి జవాబే వెనక చెప్పబడింది. శబ్దార్థాలు కవిత్వం కాదనడానికే Archbald Macleish, "A poem should not mean but be" అన్నాడు. దీన్నే Graham వివరించాడు: "This implies that the referential content of a poem is only a small part of its totality." Referential content అంటే వాచ్యార్థం. దీన్నే ఆనందవర్ధనుడనే ఒక పాతకాలపు చాదస్తుడు (మన దేశపువాడు కనక) ఇలా అన్నాడు: "శబ్దార్థ శాసన జ్ఞాన మాత్రేణైవ న వేద్యతే, వేద్యతే సతు కావ్యార్థ తత్త్వజ్ఞైరేవ కేవలం." అంటే కావ్యార్థతత్త్వం శబ్దార్థాలకు అతీత స్థానంలో ఉందన్నమాట. ఆనందవర్ధనుడికి వృత్తి వ్రాసిన అభినవగుప్తుడు దాన్ని ఈ విధంగా వివరించాడు: "వ్యంగ్య వ్యంజకాభ్యామేవ సుప్రయుక్తాభ్యాం మహాకవిత్వ లాభో మహాకవీనాం; న వాచ్య వాచక రచనా మాత్రేణ." సుప్రయుక్తాభ్యాం అనే మాటచేత చమత్కారం కావాలని సూచింపబడింది.

కావ్యార్థతత్త్వం కేవల శబ్దార్థాలకు అతీత స్థానంలో ఉంటుందిగానీ దానికి

మూలాధారము శబ్దమే; అర్థముకాదు. ఎందుచేతనంటే, అర్థం కూడా శబ్దాశ్రితమే కనక. జగన్నాథుడు అందుచేతనే రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం అన్నాడు. "శబ్దార్థ యుగలం న కావ్య శబ్దవాచ్యం.........శబ్ద విశేషస్య ఏవ కావ్యపదార్థత్వం" అని గొప్ప తర్కంతో నిరూపించాడు. ఇదే మాటను Graham అన్నాడు: "The medium of literature is verbal. Literature is made of words."

కవిత్వం ఎప్పుడు "శబ్ద విశేషం" అనబడిందో అప్పుడు కవికి శబ్ద శక్తిని గురించి సుష్ఠుగా తెలుసుకోవలసిన భారం నెత్తిన పడింది. ఇక్కడే మీ Grahamగా రేమంటారంటే తన symbolismలో- "Literature exploits other properties of words besides their referential ones; e. g. their capability of being organized into rythmical groups, their auditory and muscular suggestions, their fortuitous kinships with other words. Latent and undeveloped in ordinary language, these qualities become decisive in literature." మన దేశంలో అతి ప్రాచీన కాలంనించీ సాహిత్య శాస్త్రజ్ఞులు ఈ శబ్ద శక్తి విచారం చేశారు. "ఏకః శబ్దః సుప్రయుక్తః సమ్యక్ జ్ఞాతః స్వర్గే లోకేచ కామధుక్ భవతి" అని వైదిక వాక్యం. భారతీయ స్ఫోట వాదానికి ఇదే వస్తువు. అలంకారికుల్లో గుణ మత ప్రతిపాదకుడైన దండిగానీ, "విశిష్ట పద రచనా రీతిః" అన్న వామనుడుగానీ, "తదేవం శాబ్దే వ్యవహారే త్రయః ప్రకారాః- వాచకత్వం, గుణవృత్తిః, వ్యంజకత్వంచ...." అన్న అభినవగుప్తుడు గానీ, ఆయన గురువు ధ్వన్యాలోక కర్త గానీ, ఇంక ఎందరో, వారందరూ ఇదే చెప్పారు.

అయితే ఈనాడు మన దేశంలో వీళ్ళేమి చెప్పారు అన్నది చదివేవాళ్ళేరీ? చదవకుండానే వాళ్ళని చవటల కింద జమకట్టే మహా కవులు, మహా సాహిత్య విమర్శకులు ఈనాడు అకాడమీల్లో, విశ్వవిద్యాలయాల్లో, పత్రికల్లో, రేడియోలో ఎక్కడబడితే అక్కడ ఉసుళ్ళ పుట్ట పిగిలినట్లు వ్యాపించారు. వట్టి మాటలు రాసి ఇదే కవిత్వం పొమ్మంటూ ఉంటే, అది నిజమేనని సాహిత్య విమర్శకులు వంత పలుకుతూ ఉంటే, సాహిత్యంతో సంబంధం లేనివాళ్ళు, అధికారంలో ఉన్న అకాడమీలు, విశ్వవిద్యాలయాలు దానిమీద అధికార ముద్ర వేస్తూ ఉంటే చివరకు తెలుగు దేశంలో నిజమైన కవిత్వానికి నిలవ నీడ లేకుండా పోయింది. ఒరే వెదవా! ఏ శిక్షణా లేకుండా ఎలా రాస్తున్నావురా కవిత్వం అని అడిగే దిక్కే లేకుండా పోయింది.

నిర్భయంగా నిజం చెప్పే విమర్శకులు లేకపోవడం తెలుగు సాహిత్యానికి ఎంత దౌర్భాగ్యం! వీళ్ళు విమర్శకులు కారు; స్తోత్ర పాఠకులు, అజ్ఞానులు కలిసిన ఒక బృందగాన సమాజం. వీళ్ళు తెలుగు దేశంలో కవిత్వాన్ని ఇప్పుడు చంపడమే గాదు, తరతరాలకు మళ్ళీ తలఎత్తకుండా చంపుతున్నారు. ఎవడన్నా ఎక్కాలపుస్తక మొకటి రాసి తీసుకొస్తే ఇందులో కాళిదాసు పోకడ లున్నాయని పీఠిక రాస్తాడే—వాడు విమర్శకుడా, గాడిదా, ఎవడు?

నేను ఈనాడు తెలుగు దేశంలో కవిత్వం పేరుతో వచ్చే చెత్తంతా చదువు తుంటాను. ఒక ఎడారిలో నడుస్తున్నట్లుంటుంది. చతికిలబడ్డానికి వీల్లేదు కనక నడుస్తుంటా. పాపం, మునిమాణిక్యంగారు జ్ఞాపకం వస్తున్నారు. చచ్చాడు గనక బతికిపోయాడు గానీ బతికుంటే చచ్చేవాడు అన్నాడు. ఈ ఎడారిలో ఎక్కడన్నా ఒక్క ఒయాసిస్సు కనిపిస్తుందా అని కళ్ళు దిక్కులు చూస్తుంటాయి. దురదృష్ట మేమిటంటే, ఈ సాహిత్య ఎడారిలో చివరకు ఎండమావులు కూడా కనిపించవు. ఎక్కడో ఒకచోట ఒక చిన్న ఒయాసిస్సు కనిపించవచ్చు ఎప్పుడో చావబోతున్నప్పుడు. అలాంటి వాటిలో ఒక ముచ్చటైన నీలి ఒయాసిస్సు మన ఎల్లోరా. గట్టున ఒక చిన్న ఖర్జూరపు చెట్టుకూడా ఉన్నట్లే. ఎందుచేతనంటే, ఈ 'రేవటి వసంతం'లో ఒక శీర్షిక 'శమయతి పరితాపం'—కనక కవి శాకుంతలం చదువుకునే ఉంటాడు. చదువుకున్నవాడు అంటే, శిక్షణ పొందినవాడు అంటే వ్యుత్పన్నుడు మాత్రమే కవిత్వం రాయాలన్న సిద్ధాంతానికి ఈయన సరిపోతాడు.

నే ననేది—ఈ దేశపు శాస్త్రిల మీద భరించలేనంత ద్వేషం ఉంటే, ఆ శాస్త్రిలు పాతకాలపు చాదస్తుల పుస్తకాలన్న విశ్వాసం మిమ్మల్ని పీక్కు తింటుంటే, అవి చదవక్కర్లేదు. కానీ కనీసం మీరు ప్రమాణాలుగా ఒప్పుకునేవి ఏవో ఆ పాశ్చాత్య గ్రంథాలన్నా చదవండి. కవిత్వం అంటే ఏమిటో ముందు తెలుసుకోండి. తర్వాత కవిత్వం రాయండి, విమర్శ రాయండి. ఏదో ఏడవండి. ఏదీ చదవను నేను రాసింది మాత్రం మీరు చదవండి అంటే ఎట్లా? మీ T. S Eliot ఏమంటున్నాడో వినండి-More and more the poet has been made to confirm to literature instead of literature to confirm to poet literature being the name given by criticism to works inspired or obedient to criticism, less and less is poet permitted to reIy on personal authority." D.H. Lawrence అంతటి ప్రతిభావంతుణ్ణి శిక్షణ లేకుండా వ్రాసినందుకు Eliot విమర్శించాడు (శిక్షణ

లేకుండా కవిత్వం వ్రాయడానికి అంత గొప్ప ప్రతిభావంతులు కూడా మన తెలుగుదేశంలో ఎవరూ లేరు). "Lawrence had genius but since his talent was unorthodox, his genius was a little more than a critical embarrassment. Lawrence also suffered from a lack of not so much of information as of critical faculties which education should give..." పాశ్చాత్య దేశాల్లో సాహిత్య ప్రమాణాలు ఎంత ఉన్నత స్థాయిలో ఉన్నాయో మన తెలుగు 'కొ'లు, విమర్శకులు గుర్తించాలని చెప్పడానికి Eliot ను తీసుకొచ్చాను. స్వయంగా నోబెల్ బహుమతి పుచ్చుకున్న మహా కవి ఆయన (మన అకాడమీ బహుమతి కాదు).

కవితాప్రస్థానంలో మన ఎల్లోరాకు ఏ కొరతా లేదు. పూల నిట్టూర్పుల్లాంటి పదాలల్లి మన కాళ్ళకు అందాల బంధాలు తగిలించగలడు. కావలిస్తే భావకుంజరాల్ని శబ్ద పంజరాల్లో ఇరికించి ముగ్ధుల్ని చేయగలడు.

"నీ మౌనం వెన్నెలగా కురుస్తున్న వేళ.... వెన్నుమీద సంపెంగపువ్వు రాలిపడిన భ్రమ; చూస్తే ఆదరణలాంటి నీ చల్లని చెయ్యి"-అంతా నిశ్శబ్దంగా ఉంటే కొమ్మల్లో కిలకిల్లాడే పక్షుల్లాంటి ఈ వాక్య శకలాలు ఎంత సుకుమారమైన అనుభూతి నిస్తాయి! స్పృహ విడిచిపెట్టి ఆత్మ అనుభూతిలో జలకమాడుతుంది.

"నీ జడకుచ్చుల్లో గుచ్చుకున్న కోటి కోర్కెల కదంబంలో నునుసిగ్గుల మొగ్గలు కళ్ళు విప్పి...." గిలిగింతలు పెట్టే భావం చేతిలో గిలగిల కొట్టుకునే మనిషయిపోతాడు చదివేవాడు.

"పొంగిన క్షీరాల ఆశలను కుప్పగా పోసుకుని కట్టుకున్న మీగడ తరగలపై నా ఊహా సుందరిని రేఖా విమల విన్యాస కోమలిగా మలచి ఆ భావాలకు రూపాలు అద్దాలని ఉంది."

"నేటి నా కవితా తపస్సమీక్షలో కురిసిన ఆశాపయోధర మిది. ఎప్పుడో పొగడపూల మత్తులో జీవితాన్ని వెతుక్కున్న జ్ఞాపకా లివి...ఆశలను ముత్యాలపల్లకీలో ఊరేగించిన మధురక్షణా లివి."

'రేపటి వసంతం'లో 'శిల్పి' అనే పద్యం చాలా బాగుంది. "తాను చెక్కిన కఠిన శిలకు కరుణరసం జొప్పించును....తాను కట్టు గుడిలోపల దేవుడినే బంధించును...."

ఎల్లోరా కవితారూపంలో ఇది ఒక ముఖం. మరోముఖం - 'అగ్నికీల'లో - "గాలి అరుస్తోంది గొంతు చించుకొని ప్రేగులు తెగేలా గుండె బ్రద్దలయ్యేలా"

"అరణ్యం ఆవులింతల్లాంటి, అగ్నిబావుటాల్లాంటి మేఘగర్జనలు." ఇవి హృదయాన్ని దీకొనే ఏసుగుల్లాంటి మాటలు. అవును - అడవుల పురాతన బొంగురు గొంతుల్లో వినిపిస్తుంది మనిషి చరిత్ర.

"అక్షరాల్ని దౌర్జన్యంగా తిని త్రేనుస్తున్న చెదపురుగులు"- ఎంత బాగా అన్నాడు ఎల్లోరా!

"సూర్యుడు గ్రామంలో ప్రయాణం ప్రారంభించిన ఉదయం, చెరువుగట్టు మీంచి చేలమీదికి ఆకాశం దిగివస్తున్నట్లు భ్రమ...." ఈ భ్రమలే ఎండిపోయిన తెలుగు గుండెలమీద ఎల్లోరా చినుకుతున్న చల్లటి వానజల్లులు.

ఒక్కోసారి నా కనిపిస్తుంది ఇల్లాంటి చక్కటి వాక్యఖండాలు చూచినప్పుడు - వీటిని తెలుగు ప్రజలు సంభాషణల్లో, స్నేహసమావేశాల్లో, ఉపన్యాసాల్లో ఎందుకు దొర్లించరు? ఉర్దూవాళ్ళు దైనికజీవితంలో అన్ని సన్నివేశాల్లోనూ అలా చేస్తుంటారు. పూర్వం అంటే 30, 40 ఏళ్ళ క్రితం భావకవుల పద్యాలు చాలామంది ఇల్లా వాడుకునే వారు. ఇప్పుడు ఆ అలవాటు అదృశ్యమైపోయింది తెలుగుదేశంలో. కారణం - చొప్పదంటు కవిత్వం- అందులోనూ కొండవీటి చేంతాడులాంటి "వచన కవితా లాంగూ" లాలు రావడం అనుకుంటాను. ఈ Long అయిన లాంగూలాలు కవిత కాదు. కవిత్వం ఎప్పుడూ సాంద్రంగా, సంక్షిప్తంగా ఉంటుంది; పలచగా పారిపోసే నీళ్ళలా ఉండదు. నన్ను నేనే Quote చేసుకుంటే- "విశిష్టమైన భావం, విశిష్టమైన భాష తన రక్తంలో ప్రవహించే ఒక అసామాన్యమైన వాక్యం మాత్రమే కవిత్వం అవుతుంది. తద్భిన్నమయింది అకవిత్వం అవుతుంది." తోకల్తోకలుగా వ్రాసుకుంటూ పోవడం మన పితామహుల లక్షణం కానీ, మన లక్షణం కాదు. అరడజన్, డజన్‌వాక్యాల్లో అంతా ముగించాలి. లేకపోతే వాడు శక్తిలేని కవి అన్నమాట. కవిత్వం ఎప్పుడూ రెండు లక్షణాలు తృప్తిపరచాలి. ఒకటి- 'వ్వా' అనిపించాలి; రెండు- నాలికమీద నర్తించగలగాలి. ఈ రెండు లక్షణాలకు అవినాభావ సంబంధం ఉంది. జాషువా. కృష్ణశాస్త్రి వగైరా భావ కవుల కావ్యాలకు పూర్వం ఇలాంటి స్థానం ఉండేది తెలుగుదేశంలో. వచనకవులు వచ్చింతర్వాత చచ్చిం దా స్థానం కవులందరికీ. శ్రీశ్రీ మొత్తంలో పదిమంది నోటికీ వచ్చింది "ఏ దేశచరిత్ర చూచినా ఏమున్నది గర్వ కారణం, నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం...." ఇంతే. కాని నేను చెప్పిన రెండు లక్షణాలు ఏండేలా అందరూ రాయలేరు. ప్రయత్నం చేస్తే బయటపడిపోతారు అకవులు. ఎల్లోరా రాయగలడు.

ఈరోజు నాలుగు అందమైన ఉపమానాలతో, పది అందమైన పదాలతో కవిత్వం రాస్తానంటే వీలు కాదు. ఆర్చిబాల్డ్ మెక్లీష్ నించీ ఆనందవర్ధనుడి దాకా ఎందరయితే ఉన్నారో వాళ్ళందరి సూత్రాలకు నిలిచే కవిత్వం చెప్పినా లాభం లేదు; చాలదు. సాంకేతికంగా కవిత్వం అవుతుంది. అంతే. ఈ రోజు మనిషి అనంత విశ్వాన్ని అగ్గిపెట్టెలో పెడుతున్నాడు. అమెరికాలో మనిషి చంద్రుడిమీద అడుగు పెడితే, ఇండియాలో మనిషి ఆ అడుగు తనే పెట్టినట్లు గంతులేస్తున్నాడు. తాను గడించిన వాటి పద్దు క్రింద జమ కట్టుకుంటున్నాడు. రష్యాలో మనిషి పిడికిలి బిగిస్తే, రంగూన్లో మనిషి రక్తం వేడెక్కుతూ ఉంది. యూరప్‌లో కవిత్వం నుదుట దిద్దిన fashion ఈ దేశంలో కవుల మొహాన గీచిన గీత అవుతూ ఉంది. భాషలు దాటి, దేశాలు దాటి, మతాలు దాటి, నాగరకతలు దాటి ప్రపంచ మానవులు సన్నిహితం అవుతున్నారు. ఈ సాన్నిహిత్య సంపర్కాలు అపూర్వ వేగంతో పెరుగుతున్నాయి. కనక ఈ నాడు మానవ చరిత్ర, మానవ మహాప్రస్థానము, లేస్తూ పడుతూ నడుస్తున్న నాగరకతలు, సంస్కృతులు - ఇవన్నీ ఒక నూతన అర్థోదయంతో మన మనోరేఖల మీద ప్రస్ఫుటం అవుతున్నాయి.

ఈ చారిత్రిక సందర్భం మన కవుల భావంలో జీవంలా స్పందించకపోతే కవిత్వం అడవిమల్లె అవుతుంది. శోచనీయం ఏమిటంటే, తెలుగుదేశంలో ఆ స్పృహతో రాసిన కవిత్వం కూడా అడివి మల్లె అవుతోంది. "ఒక యుగపు నినాదాలు, సిద్ధాంతాలు ఆ యుగపు చెత్తంతా చరిత్రతో కలిసి వెళ్ళిపోయాయి.....ప్రాక్పశ్చిమాల మధ్య వెలుగు చీకట్ల తీరాల మధ్య మండే సూర్య మండలంలా మానవుడు తీరాన్నించి తీరానికి కొట్టుకుపోతున్నాడు" అని నేను రాస్తే, "ఆకలి మంటలు అగ్ని జ్వాలలు" అనే బ్రాండు కవు లెవరూ గుర్తించలేదు. అంటే ఆ కేకలు వేస్తూ గుండెలు బాదుకోవడం తప్ప, ఆ పదాల్ని ఒక పరిభాషగా వాడుకోవడం తప్ప, ఆ విషయం ఏమిటో అర్థమయి ఏడవడం కాదన్న మాట. కానీ 'రేపటి వసంతం' చదివితే ఎల్లోరా ఇవన్నీ అర్థంచేసుకొని రాస్తున్నాడనిపిస్తుంది. ఇతరుల్లా ఆ మాటల్ని ఒక Jargon లా వాడుకోడం లేదు.

ఈ Jargon ని పరిహరించడానికి చేసే ప్రయత్నంలోనించే నవత పుడుతుంది. పదేళ్ళు గడిచినా, పాతికేళ్ళు గడిచినా అదే వాడుతూ ఉంటే అది నవ్యత ఎలా అవుతుంది? పవిత్రమైన ప్రబంధ రాక్షసుల చేతుల్లో నించి బయటబడింది మరో వర్తి రాజకీయ కబంధ రాక్షసుల చేతుల్లో పడ్డానికేనా ఏమిటి ఈ తెలుగు జాతి?

నిమిష నిమిషానికీ మారేది నవత; నవనవోన్మేషమయింది కవిత. అన్ని నోళ్ళా

నమిలి పిప్పిజేసి ఉమ్మి వేసిన ఉపమానం వాడేవాడు కవిగాడు; గాడిద. వాడికి బిరుదులూ పదవులూ ఈ తెలుగు దేశంలో గనక వస్తున్నాయి గానీ మరో చోటయితే చస్తే రావు.

ప్రతి యుగంలోనూ ఒక fashion ఉంటుంది. భాషలోనూ, భావనలోనూ అందరూ దాన్నే అనుకరిస్తారు. దాన్ని పోలిందయితేనే మంచిది; పోలనిదయితే చెడ్డది. ఎక్కువ మంది సామాన్యులు fashion సృష్టించలేరు. భారతీయుల్లో అలాంటి ఎక్కువ మందిలో తెలుగు వాళ్ళు ఎక్కువ మంది. వీడి దెప్పుడూ కాపీరైటు మాత్రమే. ఏ బోదిలేరో, ఏ అల్లేన్ పోనో వచన కవిత 100, 150 ఏళ్ళ క్రింద మొదలుపెడితే, వీడు నేనే దానికి పితామహుణ్ణంటాడు - దొంగ వెధవ! "గద్యం కవీనాం నికషం వదంతి" అని ఎప్పుడో చెప్పిన ఈ ప్రాచీన భారత దేశంలో. ఈ దొంగవెధవ చెప్పిందే ఈనాటి తెలుగు దేశం అంతా నిజమే అంటుంది. ఒకడు కాదు, ఇద్దరు కాదు, దేశం దేశమంతా! నీ కిష్టం కాకపోతే నీవే ఉరిపోసుకుని చావమంటుంది. నీ వేదయినా ఒక కొత్త విషయం చెపితే అదే నీకు సమాధి పొమ్మంటుంది. బాబో! ఈ దేశం నించి పారిపోదామనిపిస్తోంది ప్రాణాల కోసం.

నేను నిర్భయంగా వ్యవహరించే కవులు కావాలంటాను. తన భావాల్ని ధైర్యంగా చెప్పే నీతి కవికి అవసరం అంటాను. నినాదాలకు బెదిరేవాడు చస్తే కవి కాడు. వాడికి ఒకటే నినాదం - అంతరాత్మ నినాదం. కవికి బయట ఎంత ప్రపంచం ఉందో, లోపల అంత ప్రపంచం ఉంది. కవి ఈ రెండు ప్రపంచాల్నీ మోస్తూ జీవయాత్ర చేస్తాడు. చెయ్యాలి. దేన్ని చంపుకున్నా వాడు కవిగాడు; దొంగ అవుతాడు. ఈయన కవిత్వంలో సమాజ స్పర్శ లేదు, అది లేదు, ఇది లేదు అనే ఈ వెధవ నినాదాలు వర్తి చవటలు చేసే నినాదాలు. వాటికి కవి బెదరడు. మైకేల్ హేంబర్గర్ ఛార్లెస్ బోదిలేర్‌ని గురించి చెపుతూ "He detested the 'progressive' cant of the newspapers and the politicians" అన్నాడు. అభ్యుదయం పేరుతో చేసే కృత్రిమ రాజకీయ నినాదాల్ని బోదిలేర్ మహా కవి అసహ్యించుకునేవాడట. మానవుడికి ఏది మంచిదో కవికి తెలిసినంతగా రాజకీయవాదికేం తెలుసు?

ఈ రోజుల్లో అందరు మానవులకూ తిండీ, బట్టా, ఇల్లూ ఉండాలి. అందరూ సమానమే అనే మాటలతో భేదాభిప్రాయం ఎవరికీ లేదు. కనక ఈ మాటలు ఏ రాజకీయ పార్టీ నినాదమో లేక మొనోపలీనో కానక్కరలేదు. అందరు కవులూ అవే రాస్తున్నారు-కొత్తవి రాసే దొక్క శుద్ధి ఎవడికీ లేదు గనక. కానీ వాళ్ళు రాస్తున్నది

కవిత్వమా అనేదే ప్రశ్న ఈ నాడు. ఇక్కడే అంటాడు Alan Bold తన 'Socialist Verse' ఉపోద్ఘాతంలో: "I personally do not believe that a socialist will automatically produce a greater work of art than a politically apathetic artist."

ఈ నినాదాలేమిటి? మానవ సమూహాల అచేతన హృదయాంతరాళాల్లో స్పందించే జ్వాలలు. ఈ జ్వాలల్ని కదిపి కవి మాటల ఒడుపులో బంధిస్తాడు; మాటతో శతాబ్దాల తోరణాలకు నిప్పంటిస్తాడు. ఆ జ్వాలల మాలలు ధరించి ముందుకు దూకేవాడు నవయుగ నిర్మాత. ఆ జ్వాలల్లో చలి కాచుకునేవాడు రాజకీయవాది. మానవ సమూహాలకు ఇదీ తెలీదు, అదీ తెలీదు. కనకనే Arthur Koestler అంటాడు— "The definition of the individual was a multitude of one million divided by one million."

కవిత్వం రాజకీయ సిద్ధాంతాల కోసం చదవము. అదే దాని పరమార్థం అయితే మార్క్స్, జయప్రకాష్ నారాయణ్, పుచ్చలపల్లి సుందరయ్య - వీళ్ళంతా మహా కవులనిపించుకోవాలి. నిజంగా ఆ సిద్ధాంతాలకు వాళ్ళే ప్రమాణం; కవులు కారు. కానీ ఆ సిద్ధాంతాల్ని కవిత్వంలో చెప్పాలంటే కవులే కావాలి. మార్క్స్ ప్రభృతులు ఏమీ చేయలేరు. ఈ సత్యం తెలుగు దేశంలో సాహిత్యవాదులకంటే రాజకీయవాదులకే బాగా తెలుసు అనుకొంటాను. ఎందుచేతనంటే వాళ్ళు ఇంత మూర్ఖులనుకోను.

కవిత్వాన్ని కవిత్వం కోసం చదువుతాము కానీ, రాజకీయ సిద్ధాంతాల కోసం చదవము. అందులో కవిత్వం లేకపోతే దాని జోలికి పోము. కనకనే T. S. Eliot అంటాడు—"A political association may help to give poetry immediate attention; it is inspite of this association that the poetry will be read, if it is read tomorrow. Because unless the political matter is humanized and transformed into poetry, it deserves to be forgotten."

ఈ ముచ్చటయిన 'రేపటి వసంతా'న్ని మన కిస్తున్న సోదరుడు ఎల్లోరాకు నా హార్దిక అభినందనలు.

జ్ఞాన్‌బాగ్<br>హైదరాబాదు-12<br>12-6-74

గుంటూరు శేషేంద్రశర్మ

నా సాహితీ ప్రస్థానంలో—
  చేయూతనిచ్చి, ముందడుగు
వేయించి, ఆశీర్వదిస్తున్న
విద్వాన్ విశ్వం;

భుజంతట్టి, మెచ్చి, ముందుమాట
  వ్రాసి, గుండె ధైర్యం
కలగజేసిన శ్రీ గుంటూరు
శేషేంద్ర శర్మ;

ముచ్చటగా ముఖచిత్రాన్ని
  చిత్రించి ఇచ్చిన ప్రముఖ
చిత్రకారులు శ్రీ బాపు

సహాయ సహకారాలు
  అందజేసి ఈ సంపుటం
తీర్చిదిద్దిన శ్రీ ఎమ్. ఎన్.
రావు, శ్రీ ధనికొండ
హనుమంతరావు
గారలకు

నా కృతజ్ఞతలు.

—ఎల్లోరా

# ఉషః కిరణాలు

ఉషఃకిరణాన్ని ప్రభాతగీతధ్వని తరంగాన్ని
    ఉషశ్చరణ మంజీరమంజుల రవాన్ని
నా వాహనంగా ఆహ్వానించి, అధిష్ఠించి,
అధిరోహించి, శాంతిని వెతుక్కుంటూ
అశాంతిని నరుక్కుంటూ క్రాంతిని పరచుకొంటూ
సంక్రాంతి హేలలను వినిపించుకొంటూ
సాగిస్తాను ఉషోదయ ప్రగతి ప్రస్థానం!

ఉదయంలో అరుణకిరణ రహస్యాన్ని
అరుణోదయంలో ప్రభాత ప్రభాపుంజాన్ని
కపోతభావనా ప్రవచనాన్ని
కోడికూతల మేలుకొలుపుల క్రాంతి పుంజాన్ని
ఇంద్రధనుస్సులోని సప్తవర్ణ రంగవల్లికల రథాన్ని
వికసిత మందార మకరందాల మాధుర్యాన్ని
నా ప్రయాణానికి పహరాగా ఆహ్వానించుకొని
ప్రళయభయాలను తుడిచేస్తూ
ప్రగతిపథాలను వెతుక్కుంటూ
సాగిపోతాను కిరణజ్వాలాముఖినై!

సురుచిర సుమధుర స్వప్నాల పాలవెల్లికి
వెన్నెల కిరణాల అలంకరణలు అద్ది
విశ్వమానవ జీవిత ప్రభాతానికి
సుప్రభాతం పలకగానికి!

ప్రభాత మనోహర దివ్య సౌధాగ్రాలను
అధిరోహించడానికి సాగిపోతాను
అరుణకిరణ జ్వాలాముఖినై!
సాగిస్తాను ఉషోదయ ప్రగతి పురోన్ముఖినై!

# అగ్ని కిరీటావిష్కరణం

అప్పుడే ప్రసవించిన
 శిశువు పెదవిమీద వెన్నెల
చావుబ్రతుకుల సంధ్యారాగంలో వెన్నెల
రెండు హృదయాల సమున్మీలనంలో వెన్నెల
దైన్యం నందిన జీవన కల్పవృక్షంమీద
ఎటు చూపినా ఆనందకోలాహలాలే!
విజయం పొందిన ప్రగతిభావుకత ముందు
చీకటి అసంతృప్తి భూతం
బ్రతకలేదు, బ్రతికి ఉండలేదు!
ప్రకృతిమాత పురిటినొప్పుల
మరణబాధలో సంతృప్తి;
పుడమితల్లి ప్రసవవేదనలో సంతృప్తి;
పసిపాప జననంలో సంతృప్తి;
రెండు హృదయాలు దగ్గరవుతున్నప్పుడు వెన్నెల
జంట ప్రేమికుల పెదవుల
చిరునగవులలో వెన్నెల!
ఎడద వాకిలిలో అనురాగ మండపంపై
కోయిలలు గానం చేస్తుంటే
నెమళ్ళు నృత్యం చేస్తుంటే
చిలుకమ్మలు విందు చేస్తుంటే
పావురాయి శాంతి ప్రవచనం వినిపిస్తుంటే
భయ సందిగ్ధకంఠంలో సైతం
అగ్గిపూలు వికసిస్తాయి!

అగ్నిగీతాలు వినిపిస్తాయి!
ఆశల ఆశయాల నమ్మకాలు
ఘనీభవించినచోట,
కావ్యకన్య చరణాల చెంత,
సంతృప్తి పచ్చని బీళ్ళలో
మానవగీతం నృత్యంచేస్తున్నచోట
ఖననాలూ, హత్యలూ ఉండవు,
మౌనరోదనకు తావు దొరకదు!
మిత్రమా! రజ్జుసర్పభ్రాంతిలోపడి
శాశ్వతంగా మోసపోయానని
ఆత్మద్రోహం చేసుకోకు!
జీవితం నిండా రాలుతున్నవి
ఎండుటాకులు కావు,
జీవితానుభవం చెప్పే జీవనాడి ధ్వని
విశ్వజనతకు ఇస్తున్న సందేశాల
తరంగాల ధ్వని అది!
మానవుడు మహోన్నతుడు!
కాలానికి కళ్ళెంవేయగల ధీరుడు!
స్వర్గానికి నిచ్చెనవేయగల శూరుడు!
సప్తాశ్వాల స్వారీలో
అభ్యుదయగీతాల సప్తస్వర
వీణానిక్వణంలో
సందేహాలనూ, చుట్టూ భ్రమిస్తున్న
తమస్సునూ చీల్చుకొని ప్రగతికై
ప్రస్థానం సాగిస్తున్న
మహామనీషి!

గతంలోనాటిన ఎర్రమందారం
ఆకులువేసి, మొగ్గతొడిగి
అరుణారుణ భవిష్యత్తుకోసం
కిమ్మీరకవాటాలు త్రోసుకొని
కరుణారుణ సామ్యస్వామ్య
విశ్వవిజ్ఞానానికి
మేలుకొలుపులు ఆలపిస్తున్న
పాంచజన్యం ఇది।
భాయీ! తిరోగమనం మానవతకు
మహోపద్రవ సంకేతం।
మానవతామహోదయంలో
మనిషిపుట్టుకతోనే విజయుడు।
చీకటిఎడారిలో మానవమహోదయం
వెన్నెల వెలుగుల క్రాంతి కిరీటావిష్కరణం।
నవ్వుల పూలరథంలాంటి మనిషిని
మానవతాస్వరూప మనీషిని
క్రాంతికిరీటాలంకారంతో
నీ ముందుంచుతున్నాను-
బానిసత్వాన్ని అక్షరతోరణాలతో అలంకరించి
చరిత్రలో తప్పులురాయకు।
బంధిఖానాల గొలుసులను
సువర్ణసుమాలని భ్రమించకు।
భాయీ! రేపటి ఉదయానికి
మన ప్రయాణంచాలా దగ్గరలోఉంది।
అందుకు ప్రగతిభావ
కవితా నినాదం పునాది।
ఉదయంలో ఉదయించే
ఉషఃకిరణ ప్రభావం మనది।।

## మూగవోయిన కవిత

చలిచలిగా ఉన్న సంకురాత్రి
భోగిమంటల క్రాంతి దీపాల వెలుగులో
వెతుక్కుంటున్న ప్రగతి భావపరిమళ
పారిజాత సుమాల రూపాలు
జంగందేవర శంఖాలు ఒత్తిన
ధ్వని తరంగాలలో వినిపిస్తున్న
విప్లవనాద ధ్వని రహస్యాలు వింటున్నవేళ।
తెలుగు తోటలో ఆధునిక కవితా చేతనా
విష్కంభానికి శాంతి జలాలు అద్దిన శుభదినాలు।
భోగి మంటల దీప్తిలో తెలుగునాడు
వెలుగుల తోరణాలు అలంకరించి
క్రాంతి దీపోత్సవాలు జరుపుకొన్న శుభవేళ।
నేను ఎంత మురిసిపోయాను।
నేనెంత ఎదిగిపోయాను।।
ఆ గర్వం నన్ను కవ్విస్తున్నవేళ
ఆనందం స్వప్నాలను నిజం చేస్తున్నవేళ
ఆధునిక కవిత అకాడమీలో సింహాసనం అధిష్ఠించినవేళ
అభ్యుదయ కవితకు మణిహార
సత్కారోత్సవం జరిగినవేళ
తెలుగు అక్షరాల హృదయాలలో
అమృతం కవితాత్మగా పలికి
తియ్యని కవితా గానం వినపడ్డవేళ
కవితలల్లి, కవితని అర్చించాలను కొన్నాను।

కవితా సుమాలతో అలంకరిద్దామనుకొన్నాను।
కాని, తెలుగునేలపై నల్లని మబ్బుల భయం
చక్రబంధంగా చుట్టుముట్టినవేళ
తెలుగునాడు వీధుల్లో రక్తం కలహంపై చల్లినవేళ
కదలలేదు కలం, పలకలేదు గళం,
గుండె ఆడడంలేదు, కన్నీరు ఆగడంలేదు।
ఆవేదన రక్తంలో నిండిపోయింది।
అందుకే సంకురాత్రినుంచీ కవిత
నా గుండె లోతుల్లో పలకలేదు।।

# క్షీరసాగరం

నేటి నా కవితా తపస్సమీక్షలో
  కురిసిన ఆశాపయోధ రమ్మిది!
ఎప్పుడో పొగడపూల మత్తులో
జీవితాన్ని వెతుక్కున్న జ్ఞాపకాలివి!
ఏనాడో పైరుగాలి గుసగుసలతో
అనుభూతుల చిక్కగా గుచ్చుకొన్న ముత్యాల సరాలివి!
సిరిసిరిమువ్వల సవ్వడి నా గుండె గుడిలో
పలికించిన వరవడి ఇది!
ఎప్పుడో కోనసీమ కొబ్బరి నీడలో
దోచుకొని దాచుకొన్న జ్ఞాపకాలివి!
పెద్ద చెరువుగట్లపై వేదసారాన్ని
ప్రబోధిస్తున్నట్లు నిలిచిన రావిచెట్లు
వసంతాన్ని మనసునిండా అలంకరించుకొని
ఆశలను ముత్యాల పల్లకీలో
ఊరేగించిన మధురక్షణాలివి!
నా సాహితీ ప్రస్థానంలో కవితా హృదయం
పొంగించిన క్షీరసాగరం ఇది!
నా నవకవితా కల్హార కదంబంలో
మధుమాస లీలలివి!!

# అగ్నిగానం

నవ్వే అగ్నిలో నిజాయితీ ఉంది
 చిగురించే రెమ్మలో గాంభీర్యం ఉంది
కార్మికుని ఘర్మజలంలో
విప్లవశక్తి ఉంది!
నిప్పులో చైతన్య స్ఫూర్తి వుంది!
అరణ్యం ఆవులింతలో
విశ్వరూప వికటాట్టహాసం ఉంది!
ఇన్నింటినీ మించి
క్రాంతి జ్వలిత జ్వాలాతోరణాక్షర
మహాసందేశఋక్, దిక్
సంకేత చిహ్నం ఉంది!
అగ్నిగానంలో విప్లవ
ప్రబోధం ఉంది!
అగ్నిధారలో క్రాంతి సందోహం ఉంది!
నిప్పుపూల పరిమళంలో
సత్యం శివం సుందరం ఉంది!
ఎర్రని మంటల ప్రభంజనంలో
శ్రామిక జనతాతతి
నరాల సత్తువ సవాలు ఉంది!
జగమంతా జనమంతా
ఏకంగా నడిచేందుకు,
ఒక్కుమ్మడి ఉరికేందుకు
అందరికీ సౌఖ్యాలను

పంచేందుకు
బీళ్ళల్లో ఎడారి పర్రల్లో
స్వర్ణఫలం పిండేందుకు
సస్యశ్యామల స్వర్గ సుఖం
పొందేందుకు
పాడతాను ప్రజలపాట!
నడుస్తాను ప్రగతిబాట!
అరుణార్కుని ఉదయార్కుని
కిరణంలో కిరణంలా!
అంతవరకూ నిప్పుమంట చల్లారదు
అంతవరకూ అగ్నిగానం ఆగిపోదు!
అక్రమాలను అంతం చేసేవరకు
అగ్నివీణ వినిపిస్తూనే ఉంటాను!
అగ్నిగానం ఆలపిస్తూనే ఉంటాను!
శుభోదయానికి ప్రగతీ
మహోదయానికి
నవకవితా కల్హార తూలికలతో
స్వాగతగీతం పాడుతూనే ఉంటాను!
కైశికీ కావ్యాన్ని
ఆవిష్కరిస్తూనే ఉంటాను!
మందేహ నిబర్హణానికి
కంకణ ధారణం చేస్తున్నాను!
జరగనున్న విజయోత్సవ
కల్యాణానికి
తలబ్రాలు
సిద్ధం చేస్తున్నాను!!

# సమతా దీపాలు

అది అర్ధరాత్రి!
అందరూ పిడికిలి బిగించి
దాస్య శృంఖలాలు తెగగొట్టి
స్వర్గ సోపానాలు
కట్టడం ప్రారంభించిన
మొట్టమొదటి రాత్రి!
అది ఆగష్టు 15- అర్ధరాత్రి!!

స్వాతంత్ర్యయోధులకూ
విప్లవ వీరులకూ
కారుచీకట్లలో కాంతిరేఖలు
కనిపించిన దివ్యరాత్రి
స్వాతంత్ర్యం ఉదయించిన
దేశమాతృబంధనాలు
బ్రద్దలయిన పుణ్యరాత్రి!
అది 1947 ఆగష్టు 15 రాత్రి!!

కలిసిఉన్న ఖండం రెండు అయింది
కలిసిమెలసి తిరిగిన స్వాతంత్ర్యవీర
హృదయాలు విడివడి పోయాయి
మతం మానవుని పిచ్చివాడిని చేసి
తెల్లదొరలచేతిలో కోతిని చేసింది!
జైళ్ళు ఆవులించాయి
తుపాకులు ముడుచుకున్నాయి

దొరతనం పలాయనం చేసింది
స్వాతంత్ర్యశంఖం విజయనాదం చేసింది॥
నవభారతప్రాంగణంలో
స్వాతంత్ర్యలక్ష్మికి
యువవీరులు రక్తాక్షతలతో,
పెద్దలు శుభాక్షతలతో
స్వాగతం పలికారు।
ఉరికంబాలు సైతం
ఇన్‌కిలాబ్ జిందాబాద్ అన్నాయి॥
గదర్ వీరుల త్యాగం
నవతకు ఋగ్వేదం అయింది।
నవభారతికి ప్రగతి మార్గం వేసింది॥
జాతీయనాయకులతో త్యాగాలు
శాంతి భారతికి
మణిమకుటం అలంకరించాయి॥
అది 25 ఏళ్ళనాటిమాట॥
అది ఆనాటి త్యాగాలకథ॥

స్వాతంత్ర్య సమరచరిత
రజతోత్సవ జన్మదినం
జరుపుకొంటున్న రోజిది।
నవసమాజానికి యువత
రక్తాక్షరమాలలు
అలంకరిస్తున్న సమయమిది॥
ఇరువదిఅయిదు ఏళ్ళు
గతానుభూతుల చలువపందిరి నీడలో

చేదాంకలిపికట్టుగా ప్రతిజ్ఞ।
చేసే ప్రతిపనీ మనిషి కోసమనీ
వేసే ప్రతిఅడుగూ ప్రగతికోసమనీ
రాసే ప్రతికవితా సమతకోసమనీ
పాడే ప్రతిపాటా సమసమాజ
నిర్మాణ ప్రస్థాన సందేశమనీ-
ఇది 1972 ఆగష్టు 15
పాతికేళ్ళ మహాయాత్రకు
ప్రతీకగా వెలిగిద్దాం
యువతలో నవతా దీపాలు।
నవతలో సమతారూపాలు॥

## హేమంత కిరీటం

చల్లని గాలితెమ్మరలపై! ఎగురుతూ
 ఆడుతూపాడుతూ పరుగెడుతూన్న మొగలిరేక
ముగ్ధకపోలాలపై నాగుండెలోని ప్రేమామృతంలో
నా కవితా ఘంటాన్నిముంచి ప్రేమగీతం రాయలని వుంది!
ఆగీతానికి రాగం కట్టి అనురాగాల మంజుల మంజీరాలు
అందెలుతొడిగి ఆడించాలని ఉంది!
మాటనేర్పి పాడించాలని ఉంది!!

పొంగిన క్షీరాలు ఆశలను కుప్పగా పోసుకొని కట్టుకున్న
మీగడ తరగలపై నా ఊహాసుందరిని రేఖావిమల
విన్యాసకోమలిగా మలచి ఆ భావాలకు
రూపాలు అద్దాలని ఉంది!
అజంతా సుందరిని పిలిచి పక్కన
నా ఆరాధ్యదేవతను నిలిపి
ఈర్ష్యతో అజంతారాణి ముఖం కందగడ్డలా
చేసుకొని చూస్తూంటే కొంటెగా చూడాలని ఉంది!
కొంటెతనం చూపాలని ఉంది!!

వెన్నెలవెలుగుపై హేమంత కిరీటం ధరించి,
వెలుగుబావుటాల శాంతిరథంపై నెలవంక వాకకు వెళ్ళి
రసవాహినీ సముజ్వలమైన జ్యోత్స్నాతరంగాల
ప్రేమగానాన్ని ఆలాపించాలని వుంది!
నా ఊహల్లో రూపంధరించిన ప్రకృతిసుందరి
వాడిచూపుల కొనలపై సత్యం శివం సుందరాల
సందేశాల ఆత్మోన్మీలనానంద ప్రగతిగీతం
విరచించాలని వుంది! అందరికీ వినిపించాలని వుంది!!

# జ్వాలాముఖి!

ఈ చీకటి పోవాలని తిరిగి
ఎపుడు రారాదని,
ఈ చీకటి విరిగి కరిగి వెలుగులు
ఉదయించాలని,
ఈ చీకటివాకిటిలో దివ్వెలు
నడయాడాలని,

ఆశిస్తూ వెలిగిస్తున్నా
కోటికోట్ల దీపశిఖలు!
శాసిస్తూ రగిలిస్తున్నా
శతసహస్రజ్వాలా ముఖులు!!

చీకటి బ్రతుకుల్లో ఆశలు
వుదయించాలని,
చీకటిగుయ్యారాల్లో కాంతులు
గుప్పించాలని,
చీకటిరాకాసిని
బందీ కావించాలని,
ఆశిస్తూ వెలిగిస్తున్నా
దివ్యదీపతోరణాలు!
శాసిస్తూ రగిలిస్తున్నా
దీపావళి తోరణాలు!!
చీకటివా తొలగిపొమ్మ.

చీకటి తినమరగిన రక్కసివా
పారిపోమ్మ,
చీకటికంతం పలికే కాంతి
బాంబు ప్రేలుతూంది,
ఈ వెలుగుల సంబరంలో
చీకటి ఇట నిలవలేదు
ఇపుడే వెలిగిస్తున్నా
అదిగో రగిలిస్తున్నా
కోటికోట్ల దీపశిఖలు!
శతసహస్రజ్వాలా ముఖులు!!

దూరాలకు, అందని తీరాలకు
తొలగిపో,
ఈ వాడల తావులేదు నీకు
తెలుసుకో,
శాపిస్తూ వినిపిస్తున్నా
విజయబేరి వీరణాలు!
ఆశను వెలిగిస్తున్నా
దీపోత్సవతోరణాలు!!
ఆశతోడ ఆశయాల దివ్వెలు
వెలిగిస్తున్నా!
సదాశయాల తోరణాల
జ్వాలలు ముట్టిస్తున్నా
వెలుగుల వుదయంలోపల
ఆనందం పండిస్తున్నా,
నా ఆశల చమురువేసి

దివ్వెను వెలిగిస్తున్నా
ఆశయాల వత్తులతో
క్రాంతులు పూయిస్తున్నా,
ఈ చీకటి తొలగి వెలుగు
ఉదయాలను చూడాలని
ఆశిస్తూ వెలిగిస్తున్నా
కోటికోట్ల దీపశిఖలు!
శాసిస్తూ రగిలిస్తున్నా
శతసహస్రజ్వాలా ముఖులు!!

# సంస్పందన

నీ కనుగుడ్డులో నా ప్యాస్ పోర్టు సైజు ఫొటో
అలంకరించుకొని-అదే అందలంగా
ఆనంద కేదారాల పల్లకీలో
కొత్త పెళ్ళి కూతురులా
ప్రయాణం-ఎంతదూరం-
మళ్ళీ మళ్ళీ వచ్చే ఉదయం వరకూ!
ఈ హృదయం రా రమ్మని పిలిచేవరకూ!!

నీ జడకుచ్చులో గుచ్చుకొన్న
కోటి కోర్కెల కదంబంలో
నునుసిగ్గుల మొగ్గలు కళ్ళు విప్పి
స్వప్నాలను పండించుకొంటున్న
సుమధుర క్షణాల తంత్రీధ్వని
తరంగాలలో ఉయ్యాల పాటలు
చెప్పే రహస్యాల సౌందర్యాలు
వినిపించే దెపుడో-ఎప్పటికో?—
మొగలి పూవు ఫక్కున నవ్వేవరకూ!
గోరువంక పాడేవరకూ!!

నీ కోర్కెల అనురాగ స్పందనంలో
అలంకరించిన గేవాకలర్ ఫొటోను
వెన్నెల జలతారుతో అలంకరించి
ప్రేమ పరిమళాలు పండించి
గాలిని పిలిచి కబురులు చెప్పి
మేఘ దూతలతో ప్రేమ లేఖలు
పంపే శుభక్షణం ఎప్పటికో—
నీ గుండె తలుపు తెరిచే వరకూ!
నా వయసు పిలుపుపాడే వరకూ!!

# నక్షత్ర గానం

మానవ జీవితానికి ప్రగతిగీతం పాడడానికి
అనాది నుంచి అనంతం వరకూ
వ్యాపించిన కాలరేఖమీద నిలబడి
రేపటి మానవ విశ్వమహోదయానికి
నక్షత్రగానం చేస్తాను।
అరుణ తారను ఆవిష్కరిస్తాను।
గుప్పిళ్ళతో వసంతాలను పంచుతాను।
గుండెమీటి అనురాగాలు అభిషేకిస్తాను।
ఇది త్రుటిలో క్షణాలలో జరిగే పనికాదు—
ఇలా తలాన హేమంపండించే యత్నంలో
హెచ్చుతగ్గుల ఎత్తుపల్లాలు చదును చేయడానికి
రోడ్డు రోలరును పరుగెత్తించినట్లు—
ఈనా తపస్సాధనా విజయానికి
విభూతిర్భూతి రైశ్వర్యాలతో
శివంను అర్చిస్తాను।
సత్యాన్ని పలకరించి
సుందరాన్ని ఆవాహనం చేస్తాను।
జీవితం చిగురించి నవ్వినప్పుడు
జీవితం త్రుళ్లి త్రుళ్లి పడినప్పుడు
నక్షత్రాల కవి సమ్మేళనంలో
ప్రగతి గీతాలు వినిపిస్తాను।
కైశికీ గీతాలు పాడిస్తాను॥
ఈ లోకానికి అది షహనాయీ ఝరిగా
ఈ జగానికి హిందోళరాగ లహరిగా
పల్లవించే పల్లవి ఆలపిస్తాను।
అంతదాకా ప్రగతికై నిరీక్షిస్తాను॥

# పహరాహుషార్!

అతడిని పట్టుకోండి
 అతడికోసం పట్టణాలు
పల్లెలు, అడవులు
పులిదాపులు నక్కబొరియలు
చెట్టుకన్నాలు, చెరువుగర్భాలు
పడవకళాసీల అన్నంకుండలు
పడుచుల కూరల బుట్టలు
అదీ ఇదీ ఏమిటి?
అన్నీ వెతకండి!
అతనికోసం వెతకండి!
అతడిని పట్టుకోండి!!

 అతనిమీద ఛార్జిషీటు
 దాఖలు చేయండి
 భగవద్గీత చదివి
 శాంతికోసం యుద్ధం
 అంటున్నాడని,
 లెనిన్ పాఠాలు చదివి
 శ్రామిక విప్లవం
 రావాలన్నాడని,
 మనిషిలో రక్తం
 ఎర్రగా వుందన్నాడని
 చావుబ్రతుకుల్లో వున్న
 సాటివాడ్ని చేరదీసి

గంజి పోశాడని,
వెట్టిచాకిరీ పోవాలన్నాడని
మనిషికోసం కవిత
రాయా లన్నాడని,
ప్రజల భాషలో
రచన చేశాడని,
"హతోవా ప్రాప్స్యసే స్వర్గం
జితోవా భోక్ష్యసే మహిం"
అంటూ రెచ్చగొడుతున్నాడని:

పారిపోతాడు జాగ్రత్త
సైన్యంలో అభిమాను లున్నారు
కొట్టి చంపకండి
జనం విరుచుకు పడతారు!
మన ఆర్డినెన్స్‌లు
పని చెయ్యడంలేదు,
న్యాయశాస్త్రం కొట్టేస్తుంది
మన అధికారం నిలిచేలా లేదు
మార్చండి ప్రణాళికలలో
కొత్తకొత్త వినాదాలు!

యువతిని బుట్టలో వేసుకోండి
నవతమాదే ననండి!
ఏమైనా భయం పోయేలా లేదు
కాపలావాడి గన్ ప్రేలేలా లేదు
మనపన్నాగం పారేలాలేదు
అధికారపు జైలులో

స్వాతంత్ర్యంకోసం నిలిచే
అతడిని బంధించండి!
బందీగా అతడిని
గాలించి పట్టుకోండి!

రేడియోలో పేపర్లలో
రైళ్ళలో బస్సులలో
ఓడల్లో గోడలపై
అతడి ఫోటోలు అతికించి
ప్రకటనలు చేయండి!
అతడిని పట్టుకోండి!
అతడిని బంధించండి!
సత్యం శివం సుందరాల
రూపంలో తిరుగుతుంటాడు!

# చంచల రోచిర్లిలలు

నీ నయనాంచలాల చంచల రోచిర్లీలలు
 నన్ను కవిస్తున్నాయి నా కాళ్ళకు బంధం వేస్తున్నాయి।
మందార మకరందాల పాటలు రాయమనీ,
వీటిని తనకివ్వమనీ అడుగుతున్నాయి।
దిగంతాల కవతలి ఏకాంత నిర్జనావనికి
కన్నీటిని త్రాగుతూ కలల కడలిలో
ఈదుకుంటూ వెళ్ళిపోయే నాకు
అమృతాలు నింపిన పంచామృతాలు పొంగిన
నీ స్తన ద్వయాలు నవ్వుతున్నట్లున్నాయి।
నన్ను పిలుస్తున్నట్లున్నాయి।।
ఇది ఋతు ధర్మమనీ ఇది జన్మ రహస్యమనీ
ఇది ఆత్మసౌందర్యమనీ
సుదూర తీరాలనుండి ఆహ్వానిస్తున్నాయి।
ఆ గామికి వినిపిస్తున్నాయి।
కన్నీటిని పన్నీటిగా మార్చుకొని
నీ పాలను పంచామృతాలుగా మలచుకొని
నీ నీడలో నా జాడలు రూపించి
భిన్నత్వంలో ఏకత్వం పొంది
పొంగిస్తున్నాను ఆనందాల పొంగుల క్షీరాలను।
చెరిపేస్తున్నాను దూరాల తీరాల అంతరాలను।
నీ రాకకు ఆహ్వానంలా
నీ పిలుపుకు ఆనందంగా
నెమలినై పురివిప్పి ఆడుతున్నాను।
పూవునై మదివిప్పి పాడుతున్నాను।।

## ఆశ చావలేదు

ఈ ఉత్తరం నీకు రాస్తున్నా।
కత్తుల బావుటాల అరపులమధ్య
ఉగ్రం ఉరుముతున్న వేళ
రాస్తున్నా తెగించి ఈ ఉత్తరం నీకు।
నీ బాటల, ఫొటోల ఆల్బం చూపి
ప్రగతిని, శాంతిని
పిశాచాలకు హారతి పడుతున్నాం।
చీకట్లో వెన్నెల వెతుక్కుంటున్నాం।।
నిజం నిష్ఠురంగా వుంటుంది—
నిన్ను గురించి మాట్లాడడం మరచిపోయాం।
కవిత్వంలో తిట్లు
తిను బండారాలుగా పంచి పెడుతున్నాం।
పూజలో పంచామృతాన్ని మాని
రుధిరాన్ని వినియోగిస్తున్నాం।
పాటల్లో, మాటల్లో, బాటల్లో నీకు
ఉద్వాసన చెప్పిన విషయం
నీకు తెలిసే వుంటుంది।
    ఆశ్చర్యం కలగదు నీకు—
    క్రాంతి దర్శివి కనుక।
    మొన్ననే నేటిని ఊహించిన
    ఋషివి నీవు కనుక।
కత్తుల బావుటాలు ఎగిరే చోట
నెత్తురు పూలు మిడిసిపడే వేళ

అగ్గిపూల పరిమళాలు
యువతను మోసగిస్తున్న రోజు।
ఇది-నీ అనంతరం
నీ జాతి సాధించిన ప్రగతి।
నిన్ను చంపిన జాతిలో
మేం చూస్తున్న నీతి॥
—అయినా ఆశ చావలేదు గాంధీజీ।
శాంతి నవ్వుతుందనీ,
క్రాంతి పరిమళిస్తుందనీ,
జాతిలో ప్రగతి భావ
సూర్యోదయం కానుందనీ।
ఆ ఉదయం వైపు
ఈ జాతి ప్రస్థానం
దగ్గరలో వుందనీ॥

## చరిత్ర పాఠాలు

అణచిపెట్టిన స్వాతంత్ర్యం
ఉబుకుతుంది లావాలా,
అణగద్రొక్కిన జనసామాన్యం
అరుస్తుంది ఫిరంగిలా!

అది చరిత్ర చెప్పిన సత్యం!
అది జరుగుతూనేఉంది నిత్యం!!

కసాయిబూటు క్రింద
సామాన్యుని ప్రాణం
మూలుగుతూంది!
ఆ మూలుగు కోటానుకోట్ల
జనతను ఒక్కటిగా
కలుపుతూంది!

సామాన్యుడు బిగించిన పిడికిలో
రాక్షసుని ప్రాణం గిజగిజలాడే
కాలం ముందుంది!
అందుకు నాంది వాచకం
వియత్‌నామ్‌లో వినిపించింది,
బెంగాల్‌లో పాంచజన్యమై
దిక్కులు మారుమ్రోగింది!

టాంకుల పదఘట్టనక్రింద
స్వాతంత్ర్యారుణ జ్వాల

భగభగమండుతూంది!
ప్రభుతనుగడగడలాడిస్తూంది!
కర్రసాములో పులిఅడుగువేసే
ముక్తిఫౌజు వలంటీరు
ఉండేలు దెబ్బకు
విమానం పొట్టపగిలి
బాంబులు కక్కుతుంది!
పసిపాపలనే మ్రింగి తుపాకి
త్రేనుస్తూంది!
అఘాయిత్యాలపై కన్నెర్రజేసిన
తూరుపుదిక్కు ప్రతీకారంగా
ముఖం ఎర్రబడింది!
సామాన్యప్రజస్వేచ్ఛకై
ధారపోసిన రక్తం
పచ్చనిచేలను ఎరుపెక్కించింది!
నాలుగు దిక్కులనుంచీ
వీస్తూందిగాలి
సుభిక్ష శాంతికై!
భయంతో పాలన సాగించే
కసాయికత్తికి గుండె ఉండదు.
స్వాతంత్ర్యం టాంకుల కింద
ఆట్టేకాలం అణగి ఉండదు!
నిన్నటి చరిత్రలో
విప్లవాలు చెప్పినసత్యం ఇది!
నేడు స్వేచ్ఛాపోరాటాల
కధచెప్పే నిజం ఇది!!

## కవి !!!

కవి :

రేపటిని నిన్న చూపి
రేపటి వాకిలి ద్వారాన్ని తెరచి
చీకటినిత్రోసి వెలుగుని వెలిగించి
జనాన్ని ఆ వెలుగుల పందిరిలో
నవ్వించే ఋషి కవి:

రవికన్నా వాడిచూపులతో
కోటికేరట్ల కిరణాలతో
లోకాన్ని అవలోకించేవాడు కవి::

పాతని పట్టుకుని పదబంధ పారిజాతాల
గమ్మత్తుకు లొంగకుండా నవతకు
పారాణిని అద్ది, ఆ అడుగుల సవ్వడిలో
జీవనాడిని స్పందీకృతం చేసేవాడు కవి:

ఘర్మజలాలనుంచి
ఆదిశక్తీ రూపానతారాన్ని
రగిలించి ఆ జ్వాలలనుంచి
విప్లవశంఖనాదాన్ని వినిపించి
ఆ ధ్వనిలోంచి ధ్వని తరంగాలలోంచి
ఉషస్‌ను ఆవిష్కరించేవాడు కవి:

ఆ ఆవిష్కరణానికి పృచ్ఛకుడుగా
నిశ్శబ్ద నిరాకార మహాశక్తిని

నిబిడీకృత మొనర్చుకొన్న
అరుణకిరణాత్మ ఉచ్ఛ్వాస
నిస్వాసాల విన్యాసమూర్తి కవి!

రోచిస్సుందర దరహాసచంద్రికల
రాగరంజిత భావనాలంకారుడు కవి!
గాలికి రూపునీ, నీటికి మాటనీ
అగ్నికి గానాన్నీ, చూపుకి స్పర్శనీ
అలంకరించి - ప్రగతికి
భవిష్యత్ కళ్యాణవేదికి
అలంకారాలు ఆవిష్కరించడానికి
ఇంద్రధనువు రంగులను
అక్షరాల మేళనలో
రూపా విర్భూతం గావించే
భవిష్యత్ శిల్పికవి!

"సర్వేజనా స్సుఖినోభవంతు"
అన్న ఆర్ష ధర్మ వేదసారాన్ని
సామ్యవేదంలా
సామాన్య జనాళికి
"పవర్ ఆఫ్ అటార్నీ" రాపివ్వడానికి
అక్షరాల గవాక్షాలనుంచి
విశ్వాంతరాళాన్ని
శాశించేవాడు కవి!
ఆ శాసనాన్ని విశ్వమానవ
మహామనీషి శ్వాసగా
కవితకు రూపకల్పన
చేసేవాడు కవి!!

# అయత్తమవుతున్నాను

పరుగెడుతూన్న ఈ బ్రతుకు గడియారంలో
స్లోఫాస్ట్‌లు సరిచేసే మెకానిజం నేర్చుకోవాలనీ
మానవుని చేతిలో రూపుదిద్దుకొంటూన్న మట్టిబొమ్మల
ఆకారవికారాలలో భగవంతుని సందర్శించాలనీ,
పూలకన్నెవాడి చూపులను పలకరించాలనీ
రంగురంగుల బట్టల రంగేళీ రసికుల
సింగారం బ్రతుకులు తూర్పారబట్టాలనీ ఆయత్తం అవుతూన్నాను:

కృత్రిమ నాగరికత రంగుల వలలో
బ్రతుకీడ్చడానికి తెచ్చిపెట్టుకున్న
బలవంతపు నవ్వులోని దుఃఖాశ్రులను తడిచివేయాలనీ
రాజకీయ సుడిగుండాల హాలాహలంలో
చిక్కిన యువతరానికి చేయిఅందించి
రేపటి స్వర్గానికి నేడే రహదారి వేయాలనీ
మానవతేజస్సులో విద్యుత్తు వెలిగించి
కాంతిబావుటాలు ఎత్తాలనీ,
సమాయత్తం అవుతూన్నాను:

బండబారిన గుండెగుండెకూ నవ్వులు
రంగరించి, మానవతతో
రంగుల ప్రపంచాన్ని ఆవిష్కరించాలనీ,
కండకరగినా పొట్టగడవని నిర్భాగ్యుల ఘర్మజలంలో
కవితాఘంటాన్ని ముంచి

పచ్చినిజాల ఛందస్సుతో
భావి జనత భవితవ్యానికి
మేలుకొలుపులు రాయాలనీ
వెన్నెలసముద్రంలో గుప్పెడు హాయిని
అందరూ పంచుకొనే దివ్యలోక
మహోదయకల్యాణానికి
శుభముహూర్తం పెట్టాలనీ
ఆయత్తం అవుతూన్నాను!

# కపోత సందేశం

కొండంత ఆశని గోరింతదీపం
వెలుగులో అవిష్కరిస్తున్నాను!
సోషలిజం అరుణోదయంలా
భావిభారతమహోదయానికి
గోరింతదీపాన్ని కొండంత
ఆశతో వెలిగిస్తున్నాను!

సవ్యసాచిలా పూరిస్తున్నాను
గతతార్కిత భౌతికవాదం ధ్వనించే
సమతాశంఖాన్ని
విజయునిలా సారిస్తున్నాను
అక్రమాలు అంతంచేసి ఆనందం అందరికీ
పంచేందుకు గాండీవాన్ని!
నేను ఆరంభించిన
ఈజనతామహాక్రతువుకు
కార్మికుడు, కర్షకుడు
యువత, నవత ఋత్విక్కులు!
నేను చేయనున్న సమతావధానానికి
సత్యం శివం సుందరాలు పృచ్ఛకులు!
నేఎగరేసే విశ్వపతాకానికి
చిహ్నం కపోతం!
నేవిరచించే కావ్యానికి
శాంతిప్రవచనం సంకేతం!

శోకాలు. కాకాలు, మరణభయాలూ లేని
దోపిడీలు దొరతనాలు పెత్తనం పిడికిళ్లలేని
మరో ప్రపంచ మహాప్రస్థానానికి
రచిస్తున్నాను సమైక్యతా గీతాన్ని।
వినిపిస్తున్నాను కపోత శాంతిసంగీతాన్ని।
విరచిస్తున్నాను విప్లవ తామ్రశాసనాన్ని॥

# మల్లెపూల జ్ఞాపకాలు

చందమామ!
నిండుదనం నింపుకున్న నెలరాజు
ఆకాశాన నిలిచి భూతలాన్ని
దేదీప్య మానంగా ఏలుతూన్న
వెన్నెల సమయం!
ఆ రోజు!!
ఆమడదూరాన్న నిలిచిన నన్ను
రమ్మని పిలచిన మల్లెపూల పరిమళం!
ఆకులుకూడా మూసుకుపోయిన
మల్లెల పందిరి చూసి
ఎంత మురిపిపోయాను
జ్ఞాపకం వచ్చింది!
అది వసంతకాలం!
అమ్మ-అందరూ ఊరిలో లేని సమయం
ఆ నాలుగిళ్ళ భవంతిలో నేనూ నువ్వూ.
విడిచి నవ్వుతూన్న మల్లెలూ
పిండార బోసినట్లున్న వెన్నెల
కమ్మనిగాలి, తియ్యని సమయం
తప్ప-ఎవరూలేని ఏకాంతం అది!
పెరట్లో-మల్లి పందిరి నీడలో
తులసికి ప్రక్కన వేసుకున్న మంచం!
నిజం చెప్పనా?
ఆ నాటి మల్లెపూల వాసనలూ,
మల్లెల గుసగుసలూ

ఇప్పటికీ జ్ఞాపకం!
ఆ మాటే నేను గుచ్చిగుచ్చి
నీకు చెబుతూంటే
నీ బుగ్గలు మల్లెమొగ్గలై
ఏవేవో చెప్పాలన్న ఆ ప్రయత్నం!
ఆ దృశ్యం, ఆ సంఘటన
నా గుండె పుటలో రాసుకున్న
సువర్ణాక్షర మధురాను భూతి!
మల్లెపూల సువాసనలు
మరచిపోలేని ఆనందాను భూతి!
ఆ నాడు ఆ సుగంధ పరిమళాల
వెన్నెలవాకలో నెలవంకగా
నువ్వు చేసిన చిలిపితనం
తలచుకొంటూంటే
అప్పటి ఆ వసంతం
మళ్ళీ మన జీవితాలలో
వర్షించాలనీ,
ఆ మల్లి పందిరి
తిరిగి తిరిగి మొగ్గతొడగాలనీ,
ఎంత ఆశగా ఉందనీ!
ఆ మల్లెపూల మందహాసాన్ని
జన్మ జన్మలకూ మరచిపోలేను!
ఆ మల్లెమొగ్గల్లాంటి నీ బుగ్గల్లో
నేను దోచుకొని
దాచుకొన్న అదృష్టాన్ని
జన్మ జన్మలకూ వదలుకోలేను:
మల్లెపూలు పరిమళిస్తున్నాయి!
నీ బుగ్గలోని చక్కదనంలో
నాకై వసంతం ఉదయిస్తూంది!!

# అగ్నికీల

గాలి అరుస్తూంది గొంతు చించుకొని
   ప్రేగులు తెగేలా, గుండె బ్రద్దలయేలా!
గాలినిండా క్రోథం నరనరంలో ఖేదం
సుడులై వడులై గావు కేకవేస్తూంది!
ఇంద్రధనుస్సు ముఖంలో అగ్నికీల వికటాట్టహాసాల
జ్వలిత జ్వాల రణగొణ ధ్వనులు!
ముఖమంతా మంటలను పులుముకున్న
ప్రభాకరుని నేత్ర ద్వయంలో రక్తకీలల వెర్రికేకలు!
అరణ్యం ఆవులింతల్లాంటి అగ్నిబావుటాల
వంటి మేఘ గర్జనలు!
విహాయస వీధుల్లో శాంతికపోత గమనంలో
కత్తుల వంతెనల బెదిరింపులు కవ్వింపులు!
పుట్టగానే ఏడ్చిన పసిపాప చిరుపెదవులు
పలికిన రహస్య సంకేత ధ్వని తరంగాలు!
చచ్చిపోయినవాడు ఏడిపించి వెళ్ళిన క్షణం
ముఖమంతా పులుముకున్న దుఃఖాశ్రు
నయనాల నీడల్లో
స్మశాన వైరాగ్యగీతాలు!
చీకటి లాంటి ఉరకలు!
రక్తం లేని సామాన్య మానవుని
అస్థిపంజరం పఠించే
గరుడ పురాణ కాలక్షేపాలలో
నీడల గుసగుసలు ఊడల పకపకలు

జనం భయంతో వికావికలు!
మంటల కొనలో నిలిచిన మనిషి
అగ్నికీల మధ్యలో పంజా విప్పిన ప్రగతి
రక్తాక్షరాలతో లిఖిస్తూంది చరిత్రని
ప్రగతి గవాక్షాలలోంచి మానవత
సర్వ మంగళ మహా పర్వంగా తొంగి చూస్తూంది!
సర్వం శాంతి మయం చేస్తూంది!
ఆ భావం అందరిలో ఇక ఉదయిస్తుంది!!

# ఇంద్ర ధనుస్సు

రంగు రంగుల ఇంద్రధనుస్సు
రంగరిస్తున్నది మదిలో ఆనందాన్ని
రాగ రంజితమైన ఉషస్సు
కలిగిస్తూంది క్రాంతి వాకిట శాంతిని!
రాజు అహంలా మెరిసే కత్తి
అంచుమీద సామాన్యుడు నడుస్తాడు
పీర్ల మీద మతం పరుగెత్తినట్లు
పీనుగుల గుట్టలపై సామ్రాజ్యవాదం
చలాయిస్తుంది రాజ్యాధికారాన్ని!
పీనుగల గుట్టలు
పిశాచాల నిలయంగా మారినట్లు,
సామ్రాజ్యవాదుల కోటలన్నీ
యుద్ధ రాక్షసికి సింహాసనాలయ్యాయి
అక్షరాలను దౌర్జన్యంగా తిని
త్రేనుస్తున్న చెదపురుగుల్లా,
జనాన్ని దోచుకు తింటున్న
నిరంకుశ నియంతృత్వ కీటకాలు
నవశక్తి పాదాల క్రింద
నలిగి కొట్టుకుంటున్నాయి!
పక్షులు బారులు తీరి
ఎగిరి నింగిని తాకుతూన్నట్లు,
జనం సాగిస్తున్నారు
మహా ప్రస్థానాన్ని,
గమ్యాన్ని చేరుకునేందుకు!
అగమ్యాలను చెరిపేందుకు!!

## తమసోమాజ్యోతిర్గమయ

నేను కోరుకుంటాను:
 సామాన్యుని జీవితం
పచ్చగా ననలుతొడిగి
పెదిమచివర చిరునవ్వులు
చిందు లాడాలని!

గేదె పెరుగు
లేడిమాంసం కాకున్నా
మట్టిపిడతలో కాస్తంత
మొన్నటి బువ్వ నేడు
అతని ఎండిన డొక్కని
శాంతపరచి
అశాంతిని నిద్ర పుచ్చాలని!

ఆడదైనా, అర్భకుడైనా
నిర్భాగ్యదామోదరుడైనా
యజ్ఞవాటికలో
మంత్రాల వెర్రికి
మోసగించబడిన
మేక కడసారి చూపు
చెప్పిన శాపాల రహస్యాలు
వీరి బ్రతుకును
నిష్పచ్చరం చేయకూడదనీ
కోరుకుంటాను!

ఎర్రజండా అయినా,
తెల్లజండా అయినా
కపోతమయినా
గ్రద్ద అయినా
భయపెట్టి ప్రజాస్వామ్యం
అభయాలపేర నియంతృత్వం
మానవుణ్ణి బంధించి
కాల్చుకు తినకూడదనీ
కోరుకుంటాను॥

# వెన్నెల విన్యాసం

నా పాట విని నెమలిలా నృత్యం చేశావు
నా పాట విని కోయిల్లా గొంతెత్తావు
నా పాట విని నాగంలా నాట్యం చేశావు
నా పాటకు పువ్వులా పరిమళించావు!
ఆ పాటలో, నా మాటల మాలతీమాధవంలో
కదంబరహస్య విన్యాస రోచిస్సులు
చిందులాడిన శుభవేళ - ఆనందహేళ!
ఆ మాటే మీ టావు నీ హృదయవీణపై
ఆ పాటలపల్లవి రాగంలో నేను
దాగివుండి, వెన్నెలపరదాలు
తొలగించి తొంగిచూస్తూన్నాను కదూ!
నీ అక్షరాల అక్షయ కుటీరంలో
కవితాసుందరి చేసిన హావభావ నృత్యం
వసంతగాన విన్యాసం కనిపిస్తూనే వుంది.
కొంటెతనం విడియంవేసి
మొండితనం అమృతం త్రాగి
కొమ్మనుచేరి కోరమీసం త్రిప్పి
కోడెనాగులా నాగస్వరం
వినిపించిన రాత్రి - జ్ఞాపకాలు!
లోకానికి జడవవు - ఖాతరుచెయ్యవు
గుండెమీద చూపెట్టి కిచకిచలు అద్ది
పకపకల విరజాజులు కురిపిస్తావు.
లొంగకూడదనీ, ఒంటరిగా నిన్ను

కలవకూడదనీ చేస్తాను ప్రతిజ్ఞ
నీ పాట వినిపిస్తుంది - ఏ మూలనుండో
నీ పేరు కనిపిస్తుంది ఏ పాట చివరనో
అంతే, ఆ మత్తులో నీ కవితా మాదుర్య
రసజగత్తులో - అమృతస్నానాలు
చేస్తాను - ఆనందాక్షతలు
చల్లుకుంటాను
అంతలో సిగ్గుదొంతరలు
చిందులాడతాయి బుగ్గలమీద!
చేతితో తడిమి చూస్తాను
ఆ బుగ్గలపై నీ పెదాల గుర్తులు!
ఆ గుర్తుల్లో నీ గుండె మీటిన మాటలు
ఆ మాటల్లో మధురానుభూతులు!
అన్నింటిలోనూ నువ్వే కనిపిస్తావు.
మాటలో, పాటలో, అద్దంలో,
పువ్వులో, వెన్నెల్లో-చందమామలో!
దాచుకొందామని అనుకొంటాను
చెరక్కుండా మధురస్మృతులని,
దోచుకొన్న రస భవభూతి
భావ గభీరతాదృష్టాన్ని!
గొంతెత్తి పిలుస్తాను-దాసిని,
నీ రాధని-రా రమ్మని!
పువ్వుల నవ్వులు తప్ప
వెన్నెల చిందులు తప్ప
ప్రకృతి పాటలు తప్ప
కనిపించవు నువ్వు!

కోపం ముక్కుమీద నిక్కిచూస్తుంది.
గుండె బండరాయి అవుతుంది।
అంతలో ఏ కొమ్మ చివరనో
కోకిలమ్మ ఓదార్పుల జోలపాట।
అల్లంత దూరంలో పురివిప్పిన
మయూరి నాట్యాలు।
ఒళ్లంతా పులకరింపు
కళ్లనిండా కవ్వింపు
గుండెలో వెతుక్కుంటూ
నువ్వు కవితారూపంలో
నా గుండెల్లోనే దాగున్నావని
తెలిసి మురిసిపోతా।
గర్వంతో విరిసి
ఆ పాటే పాడుకొంటా।

## ఆశల నేత్రాలు

మనిషి మర్మజలం తాగి నేల చల్లబడే
మధురాతిమధుర శుభదినంకోసం
ఉదయిస్తా ఆశల నేత్రాలతో!
ఉద్యమిస్తా క్రాంతి పతాకాలతో!

ఇలా తలం ప్రసవించిన పాలకంకులతో
కలకలలాడే ప్రగతి పథంవైపు
ఆశావాదినై ఎదురువెడతాను!
ఆశాకిరణమై ప్రసరిస్తాను!

కొండరాళ్లను గుండకొట్టే జనం
గుండె విడిచే ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు
జ్ఞానస్పర్శను ఆవహింపజేసి
సమాజానికి నౌబత్ నగారా వినిపిస్తాను!!

## మధుర క్షణం!

ఏదో కల!
కలలాంటి తియ్యని విందైన
పసందైన-పదిలంగా
మనసులో దాచుకొనే
కమ్మని కల!
కన్ను తెరచాను
కల కాదు నిజం!
మల్లె కళ్ల విప్పి
ఫక్కున నవ్విన క్షణం
అపుడే అనుకొన్నాను
మల్లెపూల ఆనందాలకు
సన్నజాజుల గుసగుసలకు
గులాబీల పెదిమ నొక్కుళ్లకు
నా రాధే కారణం అని!
ఏమిటి!
ఈ చిలిపితనం కొంటెతనం!
అందానికి దొరసానీ,
అనురాగానికి రాధీ
అల్లరికి వరూధినీ
రా! ఆ బుగ్గల స్నేహసన్నిధిలో
నా ప్రేమానురాగాలు అద్దుకోనీ!
రా! ఆ చిలిపికనుల రేకుల్లో
భావకవితలు రాసుకోనీ!

రా! మనసువెన్నెల ఇసుకలో
నీ ఒయ్యారాల సింగారంలో
నన్ను స్నానమాడనీ!
ఆ అనురాగ జలధిలో
నన్ను జలకమాడనీ!
ఏదీ! అల్లరిమాటలు
కళ్లల్లో వినిపించు!
ఏవీ! కొంటెచూపులు
బుగ్గల్లో చిందించు!
ఆడుకోనీ-నీ రాధామాధవుని
నీ గుండెవాకిలి తెరిచి
ప్రేమానురాగాలతో
అలంకరించిన-నీ
నందనంలో-బృందావనంలో!
కల కాదు-రాధీ
నువ్వు నవ్వుల పువ్వులు
జల్లిన పొన్నుపూల పరిమళాలు
ఇంకా కరిగిపోలేదు!
నువ్వు వయఃఫలకంపై
మనో ఘంటంతో
రాసిన ప్రేమలేఖ
    చిరిగిపోలేదు!
    అడుగు!
మనకోసం విరిశి విప్పారిన
మల్లెపూల గుత్తులని!
మనకోసం ఎదురుచూస్తున్న

సన్నజాజుల్ని!
ఆ క్షణం ఎంత కమ్మనైనది
ఆ క్షణం ఎంత మధురమైనది
ఆ క్షణం ఎంత విలువైనది!
అనుక్షణం ఆ క్షణంకోసం
ప్రతిక్షణం ఆ మధురక్షణంకోసం
ఎదురుచూస్తుంటాను!
నాకు తెలుసు —
నాకోసం నువ్వు వస్తావని!
నీకోసం మల్లెలు పూస్తాయని!
మనకోసం ప్రేమ పారిజాతాలు
ఎదురు చూస్తుంటాయని!!

# వేదార్ధసారం

త్రేనె కోరుకునే నాకు
  తేనెటీగ కుడుతుందని తెలుసు!
తేనెటీగ పూలబాలల పీక నొక్కినా
తరువాత తేనెకావళ్ల
నింపుతుందనీ తెలుసు!
భూమాత పురిటి నొప్పులు
రేపటి ఉదయానికి
మొదటి మెట్టనీ తెలుసు!
ఉదయాస్తమయాలు కాలచక్రంలో
గతి తప్పనివనీ తెలుసు!
కొవ్వొత్తి వెలిగిస్తే
కాలిపోతుందని తెలుసు!
కరిగి నీరై కన్నీటిని పన్నీటిగా
మలచుకొనే గుండెబలం
తనలోని కొవ్వుని తనే మండి
కరగించుకొంటుందనీ తెలుసు!
  నెత్తి చుర్రుమంటున్నా
  బుర్ర ఆలోచనలతో
  వేడెక్కి పోతున్నా
  తనను ఆశ్రయించిన మర్రినీడ
  చల్లని ఆశ్రయాన్ని ఇస్తుందనీ తెలుసు!
ఆ నీడనిచ్చే చల్లని మనసు
ఆ వృక్షానికి ఉందనీ తెలుసు!

తాను పెరిగి వయసుతోపాటు
మనసుని పెంచుకొంటూ
ఆ మనసు నిండా తీపిని నింపుకొంటూ
గణుపు గణుపుకూ అనుభవాల
తియ్యదనాన్ని ఆవిష్కరించుకొనే
చెరకు గడలో త్యాగం,
గుండెధైర్యం ఉందని తెలుసు!
ప్రజకోసం, ప్రజా హక్కులకోసం
తాను నమ్మిన ప్రగతికోసం
నవ్వుతూ విప్లవవీరుడు
ఉరికంబం ముందు నిలిచినట్లు,
తనను పెంచిన, తన్ను నమ్మిన ప్రజకోసం,
వారి నోటినిండా పంచదార
తినిపించడం కోసం,
ఇనపపళ్ళ చక్రం మధ్య
తనను పిప్పిచేస్తుంటే
చెరకుగడ నిండుమనసుతో
మధుపానీయాన్నే
పంచి పెడుతుందనీ తెలుసు!
—నాకు తెలియంది!
నేను నమ్మలేంది-
మనిషిని దోచుకోడానికి
మనిషిని పీల్చి పిప్పిచేసే
మానవుని గురించి!
మానవ నైజాన్ని గురించి!
స్వార్థానికి అగ్నిగోళాలను

రగిలించే యుద్ధరాక్ష సతతి గురించి!
అందుకే కొవ్వొత్తిలా,
తేనెటీగలా, మర్రినీడలా, చెరకులా
బ్రతికి-మంచినీ, వెలుగునీ పంచమనీ
ఆ మంచి గాలిలా, నీరులా-ప్రకృతిలో
మనిషి ప్రవర్తనలో కలిసి
ఈ విశ్వవలయాన్ని శాంతి తోరణాలతో
అలంకృతం కావించాలని ఆశిస్తూ
"ఆనోభద్రాః క్రతవోయాతు విశ్వతః" అని
అగ్నిసూక్తం ఆలాపిస్తున్నాను!!

## మంటల పందిళ్లు!

ఈ ఉగాది సన్నాయిపాట పాడనంటూంది
గున్నమామిడి కోయిలమ్మ పలకనంటూంది
పేదబ్రతుకుల కథవిన్న మల్లెమొగ్గ
కళ్లు విప్పనంటూంది!
కొత్తఉగాది పచ్చడి తినడానికి యువత
ముఖం చిట్లించుకొంటూంది!
పాతవే అయిన ఈ రుచులలో కొత్త
లేదని కసురుకొంటూంది.
ఈ కొత్తఉగాదిలో ఆనందం
వెతుక్కోడానికి పచ్చతోరణాల
కోర్కెలతో జనం పరుగెడుతూంది!

అరవై ఏళ్లనాటి మాట! పన్నెండు నెలలు
మా వాళ్లను పేరుతో అందలాలు
ఎక్కించిన నాటి మాట!
తిరిగి మరో అరవై ఏళ్ళకుగాని
ఎన్నికల సమయంలో మా మంత్రుల
దర్శనంలాగ వస్తావు!
విజయం సాధించిన మంత్రి
కలికంలోకే కనిపించని
ప్రజాస్వామ్య ధర్మంలాగ
మళ్ళీ నీపేరూ, రూపం వినిపించదు కనిపించదు!

'ఉగాది' అనగానే కడుపు నిండినట్లుంది!
'ఆనందం' జీవితంలో నవ్వినట్లుంది!
కాని, తీరాచూస్తే క్షణమైనా నిలవని
తామరాకుమీది నీటిబొట్టులాగుంది
ధరలు నింగిమీదికి మాదేశం
సాధించిన ప్రగతికి చిహ్నంలా
ఎగిరిఎగిరి నక్షత్రాలతో ఆడుకొంటున్నాయి!
ఓటువేసి గెలిపించిన అధికారం
ఆకాశంలో ధరల సంత పెట్టి
నింగిమీద నిలచి
ఆకలంటున్న సామాన్యుని దీవిస్తుంది
ఇలాగే మరో కొత్త ఉగాదికోసం
ఆశతో ఎదురుతెన్నులు చూడమని!

ఈ ఉగాది సరిగమల రాగాలు
పాడనంటున్నా
గున్నమామిడి కోయిలమ్మ పలకనంటున్నా
బ్రతుకు బరువుల కథవిన్న
మల్లెమొగ్గ కళ్లు విప్పనంటున్నా,
ఈ ఉగాదికీ పచ్చతోరణాలు కడుతూంది
ఆశతో బ్రతుకుతూన్న జనాళి!
ఆశల ఆశయాల రేపటి పూదోట
విడిపి విప్పారాలనే ఆశతో
నేనూ పలుకుతున్నాను -
స్వాగతం నీకు ఉగాదీ!!!
అందని అందానివి కావద్దని,
అందరి పక్షానా కోరుకొంటున్నాను!
"కవిత"గా అర్జీ పెట్టుకొంటున్నాను!

# సముద్రం అంత బాధ!

సముద్రం అంత బాధని
పిడికిలి అంత గుండెలో
బడబాగ్నిలా ఇముడ్చుకొని
మనసులో అగ్నిజ్వాలలు
హాహాకారాలు చేస్తూంటే
పెదాలచివర వెన్నెల్లా
వెకిలి నవ్వులు
సత్యాలు ఎలా పలుకుతాయి!
సత్యాలు అక్కడ
ఎలా బ్రతుకుతాయి!!
శరాఘాతానికి కళ్ళల్లో
నిప్పులు మండించుకొంటున్న
పెద్దపులి చర్మం కారుస్తూన్న
ఎర్రని హింసా రక్తంలో
అహం అందలం ఎక్కుతూంటే
అడవిలో మల్లిపూలు చెప్పే
అమాయక పురాణాలు వినే
ఓపిక ఎవరికి ఉంది?
మంచి గంధం రాసుకునే
తీరిక ఎక్కడుంది??

# గోరంత దీపం....

చిచ్చుబుడ్డి వెలుతురులో
జీవితాన్ని వెతుక్కోకు
చిక్కటి చీకట్లో
జాతకాన్ని పరచుకోకు।
అరుణారుణ భవిష్యత్తుచూసి
జడిసి గుండె బాదుకోకు।

ఆవులించిన అడవిలా
కళ్లు నలుపుకుంటున్న ఆకాశంలా
నిరాశల కత్తిమీద దురాశలు
నింపుకొని నింగిమీద జాతకాల
రేఖల్ని కావలించుకోకు।।
వేసినచోట పడివుండే
ప్రభుత్వం ఫైలులా,
మూడవతరగతి రైలులో
అర్భకుడి ప్రయాణంలా,
ఆరిపోయే దీపం ఆఖరి
వెకిలినవ్వులా,
వడలిపోతున్న పచ్చతీగ
పిచ్చి చూపులా,
స్వాతంత్ర్యమనే
బంగారు పంజరంలో

తిండిలేక ఆఖరి
ప్రాణం వదులుతూన్న
మధ్యతరగతి మనిషిలా,
అస్థి పంజరంలోని బీదతనాన్ని
చిరుగుల చొక్కాపై దాచుకొన్న
చాకలివాని అద్దెకోటు బరువులా
జీవితాన్ని బలవంతంగా
ముందుకు నడిపించి
బాధపెట్టకు మనిషిని!

పాలులేక చంటిపాప
కెవ్వుమన్న అరుపు
పెద్దలు కూడపెట్టిన పాపాలకు
శాపం అని మరచిపోకు!
దాచుకొన్న కోర్కెల అందాన్ని
దోచుకొన్న మగవాడిపై
ఈర్ష్యలాంటి పడుచుపిల్ల
చివికిన గుండె గొల్లెంచప్పుడు
ఈ జగానికే సవాలన్న
మాట మరచిపోకు!

కరగిపోనివ్వకు
మనిషిలోని మంచిని!
విరిగి పోనివ్వకు
మనిషిలోని మనసుని!
చేదులాంటి భావాలకు

## రేపటి వసంతం

ఉగాది పచ్చడి తినిపించి
కమ్మగా త్రేన్చి, పాపకు
కొత్తచొక్కా సింగారించుః
సమభావపు చమురులో
సామ్యవాదపు వత్తితో
నవతా హృదయ పీఠంలో
నవజ్యోతులు వెలిగించుః
నవ క్రాంతులు రగిలించుః
గోరంత దీపం వెలిగించుః
కొండంత భావం పలికించుఃః

## అక్టోబరు-2

బుద్ధుడు పుట్టిన దేశంలో
దౌర్జన్యం కడుపు చించుకొంటూంది!
బాపూ—నువ్వు మెట్టిన గడ్డలో
సారా డబ్బులు గడిస్తూంది!
మేం గాంధేయులం బాపూ!
కట్నం లేకుండా పుస్తె కట్టం,
సారాతో ముఖం కడుక్కొని
బ్రాందీతో నిద్రలేస్తాం!
బాపూ—నీ వారసులం
మేం భారతీయులం!
నీ మీద నీ బొమ్మల మీద
మా కెంతో గౌరవం,
సాక్ష్యంగా నెలకొల్పాం
వాడవాడనా నీ శిల్పాలు!
నీ సందేశం ఇంటింటికీ అందిస్తున్నాం!
కాకుంటే మా ఇళ్లల్లో మాత్రం
రహస్యంగా తెరుస్తున్నాం
వైన్ సీసాల కార్కులు!
 క్షమించు బాపూ!
 ఇంతకీ నువ్వు ఏ కాంగ్రెస్?
 పాతా? కొత్తా? ఏది??
 ఒకటి మాత్రం నిజం
 సిద్ధాంతాలు మరచినా

చేస్తున్నాం జయంతులు:
ఎన్నెన్నో వర్ధంతులు!!
బుద్ధుడు పుట్టిన దేశంలో
దౌర్జన్యం కడుపు చించుకొంటూంది:
బాపూ! నువ్వు మెట్టిన గడ్డలో
సారా డబ్బులు గడిస్తూంది!!

## అనురాగ సంకేత సంగీతం

నీలిమేఘాలు పరుగురుతీస్తూ
నెలరాజుని ఓ ఆట ఆడిస్తున్నాయి
కొండమీద గోగుపూలు
వెన్నెల నవ్వులు కురుస్తున్నాయి
తాజమహల్ అందానికి అగరుధూపం
ప్రేమ నీరాజనం పడుతూంది
రోడ్డుప్రక్క పిల్లకాలువ గట్టున
ప్రియురాలి సమాధిచెంత నిలుచుని
జట్కాసాహెబు ప్రేమగీతాల
పారాయణం సాగిస్తున్నాడు
అతని దృష్టిలో తాజమహల్ నిర్మాణానికీ
ప్రియురాలికోసం తాను నిర్మించిన
సమాధికీ తేడాలేదు
ఆ రెండూ ప్రేమకు చిహ్నాలు!
ప్రేమికుల హృదయ సంకేతాలు!
స్వర్గసంకేతాలలా నీలిమేఘాలు!
సమాధిమీంచి, తనమీంచి పరుగులు!
ఆ మేఘాల గజ్జల రవళిలో ప్రియురాలి
ప్రేమగీతాల నృత్యసన్నివేశాల దరహాస చంద్రికలు!
తనలో చిగురింప జేసిన
సురుచిర సుమధుర స్వప్నాలు!
నింగిపై నీలిమేఘాల గుసగుసలు,
సాహేబు నిర్మించిన బీబీసమాధి

గతానుభూతులు వెన్నెల నీడలు
తనకై పరదాలు తొలగించి
కరాలు అందించి - మత్తులో
గమ్మత్తుగా - దిగంతాల
అవతలకు జంటగా దారిచూపిన
ప్రేమ స్వర్గద్వారాలు తెరచుకొన్న
ఆనంద రసార్ణవ సుమనోహర దృశ్యాలు!
అది చక్రవర్తి నిర్మించిన
ప్రేమ సామ్రాజ్య చిహ్నం!
ఇది జట్కాసాహెబు
ప్రియురాలికి జ్ఞాపక చిహ్నంగా
కట్టిన మట్టిదిబ్బ - ప్రేమ కుటీర చిహ్నం!
వెన్నెల అటు తాజ్ మీదా
ఇటు సమాధిమీదా కురుస్తూంది!
రెండింటిమీదా చల్లని కిరణాల కాంతులు!
రెండు సమాధులూ పలుకుతున్నాయి
ప్రేమకు చిహ్నంగా
అనురాగ సంకేత సంగీతాలు!!

## దేముడూ!

దేముడూ!
నిజంగా ఉన్నవా?
ఉన్నావని నమ్మమంటావా!
ఆ నమ్మకాన్ని అంతరాంతరాల్లో
పదిలంగా దాచుకోమంటావా
దేముడూ!
నిజంగా ఉన్నావా?
దేముడూ! అహం బ్రహ్మోస్మి అంటున్నారు
దేముడనే వాడొక్కడే అంటున్నారు
సోషలిజానికి గిరాకీ పెరిగినట్లు
శాంతి యజ్ఞాలు ఎక్కువైనట్లు
ధర్మపన్నాల పనసలు ముదిరినట్లు
నీకూ గిరాకీ పెంచారు –
అగ్రరాజ్యాల ఆయుధ పోటీలాగ
మీలో మీమధ్య పోటీ పెంచారు -
సోషలిజంలో సైంటిఫిక్, రాడికల్,
డెమొక్రటిక్, డిక్టటోరియల్ నక్షత్రాల్లో
విభూతకీ, శ్రీగంధానికీ, అడ్డబొట్టుకీ
నిలువు బొట్టుకీ, నామానికీ, ఎగనామానికీ
మధ్య ఎన్నికల ప్రచారంలాగ
నీకూ పబ్లిసిటీ శాఖను నెలకొల్పారు!
దేముడూ!
నిజంగా ఉన్నావా?

ఉత్స విగ్రహాల వెనుక జంటనీడల
కలయో వైష్ణవ మాయలూ,
ఆచారాల ముసుగులో
తాత్విక చింతనల తెరల లోపల
బసవురాంధ్ర, రంగసానుల రంగరంగ
అంగ విన్యాస కథకళిలు!
నీ అనుజ్ఞతో జరుగుతున్నాయా?
నీ కను సన్నలలో జరగనిస్తున్నావా?
దేముడూ!
నిజంగా నువ్వు ఉన్నావా?
ఉంటే రాళ్ళల్లో ఎందుకు
రావయ్యా బయటకు
నిన్ను కొలిచే భక్తుల చెంతకు,
ఆస్తిక నాస్తిక సంఘర్షణా
ప్రపంచం మధ్యకు!
దేముడూ!
నిజంగా నువ్వు ఉన్నావా?
ఉంటే లేచి రా!
ఉంటే కదలి రా!
ఉన్నావని నమ్మేలా
రాళ్ళను చీల్చుకు రా!
సినిమాల్లోలా, పురాణాల్లోలా!!
దేముడూ!
మనిషిలో ప్రవేశించు!
మనసుల్లో పెనవేసుకో
అప్పుడు రాతిని నమ్మే

నేటి మానవుడు
సాటి మానవుణ్ణి దేముడుగా
భావిస్తాడు - పూజిస్తాడు।
దేముడూ।
అప్పుడు మనిషిగుండె
నీకు గుడి అవుతుంది
మనసు దేవుడి
మందిరం అవుతుంది।
రాళ్ళకూ దేముళ్ళకూ
గిరాకీ తగ్గి
మనిషికీ అతనిలోని దేవుడికీ
అందులోని దివ్యత్వానికీ
పూజలు అందుతాయి।
దేము డున్నాడన్న
మనుషుల నమ్మకం
మనసులు నిజం చేస్తాయి।
దేముడులాంటి మనుషులు
ఎంతమందినైనా పూజిస్తారు
అందుకే ఒక్కమాట-
రాళ్ళు వదిలి రావయ్యా
మనిషిలో నిలవవయ్యా
పలకని రాతి దేవునికన్న
పలికే మనిషే దేముడని
లోకానికి అవలోకనంగా
ప్రబోధించవయ్యా।
దేముడూ।

ఎదురు చూస్తుంటాను
ఎంతకాలమైనా
ప్రతి ఉదయం
నువ్వు మనిషిలో ప్రవేశించే
శుభక్షణం కోసం!
మనిషే దేముడై నిలచే
అమరక్షణం కోసం!!

V.R. NARLA MEMORIAL LIBRARY
V R NARLA
D.P.R.I.
Acc. No. 10315

## సౌందర్యలహరి

నవ్వులు విండిన నీ ముఖంలో
  నందనాలు విరిసిన నీ జడలో
అమృతాలు కురిసిన నీ పెదవులలో
సంపెగలు నృత్యంచేసే నీ ముక్కులో
నీలిమేఘాలు నడయాడే నీ కన్నులలో
కావ్యకన్యా-కవితా!

కనిపించదేమి లక్ష్యలక్షణ సారసంగ్రహం!
వినిపించదేమి సప్తస్వర వీణానిక్వాణం!
జ్యోత్స్నా తరంగరాగ రంజిత మయూరీ
ప్రకృతీసంవిలసిత వినూత్న రాగమయీ
మయూర నాట్యవిన్యాస కోమలీ
మమతా మంజీరధ్వని సంకేతీ
మనుజుల ఆత్మానంద పంచాక్షరీ
వినిపించవేమి సందేశాల సంకేతాలు

వినిపించరావేమి శుభసమృద్ధ కైశికీగీతాలు!
కవితా! ఓ కావ్యకన్యా,
నీ పెదవి విరుపులో విరిసిన
కోటివెన్నెలల తరంగాలు
నీ చూపుల రస జగతికి
భావకవుల నీరాజనాలు,
నీ సుమధుర సుస్వప్నరస
జగతీవాసానికి కవులు దిద్దిన

LIBRARY

రచనా రంగవల్లికలు,
కనిపించవేమి-కానరావేమి?

రక్తాక్షర భయవిహ్వల
రుధిరజ్వాలా తోరణాలా
నీవు నింపుకున్న అమృతానంద
నందనంలో దురాక్రమణ
దురాగ్రహ దుష్టశక్తి,
నీ అపురూప సౌందర్యలహరిలో
పుర్రెల దండలా అలంకారాలు?
పదునుపెట్టిన కత్తులా నీ కంఠహారాలు??

కవితా! ఓ కావ్యకన్యా!
ఛాందసాల తమస్సునుంచి
ఛందస్సుల అడవినుంచి
నవత కోరింది విముక్తి!
జనత కోరింది స్వాతంత్ర్యం!

నల్లని రాలలో పలికే
గుండెల సంగీతాలు కావాలి,
బండరాల గుండె లోతుల్లో
వెన్నెలపూలు పూయాలి,
కమ్మదనం కవిత నిండి
శాంతివనం నవ్వాలి!
కవితగుండె లోతుల్లో
అమృతం వర్షించాలి!
మనిషిగుండె పునాదుల్లో
మానవత్వం చిగురించాలి!!

# చరమగీతం

నేటి మధ్యతరగతి జీవితం
  అర్ధరాత్రి శునక సంగీత
గీతారహస్యంలా ఉంది!
నేటి మనిషి బ్రతుకు
తినమరగిన అర్చకుని ఆలనలో
సంవత్సరానికోసారి వెల్లవేసిన
శిథిలాలయంలా ఉంది!
కృష్ణ గోదావరులలో ఎండిన
ఇసుకపర్రల బిక్కమొహంలా ఉంది!
వజ్రం దొరికిన వజ్రకరూరు
పసులకాపరి చేతిలో వజ్రం
లాక్కున్న సమయంలో
కుర్రాడి కంటినీటిలా ఉంది!
యౌవ్వనాన్ని ఆనందోపాసకులకు
పంచి, పంచరోగాల నులక మంచంలో
మూల్గుతూన్న అమాయకురాలి
అధోగతిలా ఉంది!
డిగ్రీఉండి బూటు పోలిష్‌చేస్తూ
నల్లదొరలకు ఓటువేసి
నాలుక కరచుకొంటున్న
యువకుని ప్రస్తుతంలా ఉంది!
ఇవన్నీ కలిసిన సమాజం
బోనులో బంధించిన సింహంలా ఉంది!
వీలుపడితే కోరలు విదిలించే
సన్నాహంలో ఉంది!
ఈ నరకానికి చరమగీతం
పాడే ప్రయత్నంలో ఉంది!!

# భవిష్యత్ వికసనం

గతం అనుభవాల ఖనిలోంచి
 భవిష్యత్తు వికశిస్తుంది॥
ఆ వికాసంలోంచి ప్రగతి
పరిమళిస్తుంది॥
 ఆ ప్రగతి పరిమళాలలో
 గతం కాస్త మెరుస్తుంది॥
 ఆ మెరుపుల బాటలో
 భావిజనం పయనిస్తుంది॥
పాత విత్తనాలు
కొత్తపంటకు అవసరాలు॥
పాతలోని అనుభవాలు
కొత్తవెలుగు కిరణాలు॥
 కవికి కత్తి ఆయుధం కానేరదు
 కత్తి కవిచేతి కలం కాకూడదు
 కవితలో 'సుకవితా యద్యస్తి
 రాజ్యేన కిం' అన్న కావ్యధర్మం
 తొణికిసలాడాలి నవభావ ప్రదీప్తిలా॥
 కవితలో లాలిపాటలు
 ఊయలలు ఊగరాదు,
 కవిత మనిషికి
 జోలపాట కారాదు॥
కవిత కదిలించాలి జనతని
కవిత పలికించాలి నవతని,

పాతకొత్తల మేలు కలయిక
మనిషిగుండెల శంఖమూదాలి!
క్షణం విలువ ఖరీదైనది
గతించిన ప్రతి క్షణం
తిరిగి రానిది।
ఆ క్షణమే మనిషిలో
అమృతం కురుస్తుంది
మరుక్షణం ఆ క్షణం
మధురస్మృతి రచిస్తుంది।
ఆ సుమధుర క్షణంకోసం
మనిషి మనసు
యుగయుగాలైనా
నిరీక్షిస్తుంది॥

# దీపతోరణం

ఇంటింటా దీపం వెలిగించు
ప్రతి దీపంలో నీవే కనిపించు॥

దీపంలో వెలుతురులా
హృదయంలో ఉదయంలా
కిరణంలో ఉషస్సులా
పూవులో పరిమళంలా
వెన్నెల దరహాసంలా

నీలో దీపం వెలిగించు
ఆ వెలుతురులో
నందనాలు పండించు॥
పాయసాలు వడ్డించు॥

నందనంలో మురళిలా
ఇంద్రధనుస్సు వేసిన ముగ్గులా
గులాబీ గుసగుసలా
అందియ రావళిలా

హృదయవీణ మీటి-రాగ
రవళిని వినిపించు॥
గుండె తలుపులు తెరిచి-అను
రాగఝరి ప్రవహించు॥
ఇంటింటా దీపం వెలిగించు,

ప్రతి దీపపు కదలికలో
నీవే నీడగ నర్తించు॥
వెలుగు నాకై వర్షించు॥

# వసంతర్తు గానం!

కల్హార మాలికలు చేతబూని
కైశికీ గీతాలు పాడుతూ
పలుకుతున్నాను వసంతానికి స్వాగతం
నవ ఉగాదికి సుస్వాగతం।
సుగంధ పరిమళ భరితం కాగా
భారత నవాభ్యుదయ వీచికకాగా
ఈ నాడు మానాడు క్రాంతి
యజ్ఞవాటిక కాగా,
ప్రతి ఉదయం ఎర్రని మందారం
విరిసి విప్పారాలనీ,
ప్రతి హృదయం
ఆనందో బ్రహ్మ కావాలనీ-
సుమనస్సుల మల్లె మాలలతో
కొండంత ఆశల కదంబాలతో
చైత్రోత్సవ వసంత నృత్య చేస్తూ
పలుకుతున్నాను స్వాగతం,
సమసమాజ వాంఛాభరిత సుస్వాగతం।
వస్తూంది ఉగాది
కొత్త సంవత్సరానికి పునాదిలా
సరికొత్త ఉగాది।
యుగారంభాన్ని సూచిస్తూ
కొత్త ఆరంభానికి
స్వాగతాలు పలుకుతూ

## రేపటి వసంతం

వస్తూనేఉంది ఉగాది
వచ్చి వెడుతూనేఉంది ఉగాది!
ఈ పండుగకు ఎవరు వేశారో పునాది!!
మళ్లీ మళ్లీ మనిషిలో
కొత్త ఆశలు రేకెత్తించి
సరికొత్త కోర్కెలు పూయించి
నూతన జీవితానికి నిండుగా
మనిషిని ముందుకు ఆశతో
ఆశయంతో సాగిపొమ్మని
ఉత్సాహాన్ని ఇస్తూ
వచ్చింది ఉగాది!
ఈ ఉగాదినాడు
అడుగడుగూ శుభం పలికి
శాంతినీ, కాంతినీ, క్రాంతినీ
ప్రపంచ మానవాళికి అందించి
నూతన యుగోదయానికి
స్వాగతం పలకాలి!
ఈ ఉగాది
కష్టాలూ నష్టాలూ
బాధలూ బరువులూ
ఈర్ష్యలూ ద్వేషాలూ రోషాలూ
లేకుండా జరిగిపోవాలి!
ఉగాది—
అందంగా బ్రతుకు మందారంలా
జీవితం నిండిన మకరందంలా
గడిచిపోవాలి!

కొత్త సంవత్సరం రాకతో
బ్రతుకుల్లో కూనిరాగాలు పోయి
కోకిల గానాలతో
పూలబాలల సరికొత్త భావాల
సుగంధ పరిమళాలతో
పంచామృతాలు నిండిన జాతకాలతో
ఉయ్యాల జంపాలగా
హాయిగా ఆనందంగా
నందనంలా గోకులంలా నిండిపోవాలి!
ఈ కొత్త వత్సరం
మనిషిని మనిషిగా నిలిపి
మనసున క్రాంతి శంఖాలు వినిపించి
విశ్వ విజయ గీతాలతో
ఉగాదికి స్వాగతం పలకాలి!
ఉగాది!
మనుషుల్లో మనసుల్లో
మమతల పందిళ్లు అల్లి
మమకారాల మొగ్గలు తొడిగి
సమతా పుష్పాలను విరిసి
ఆనంద గీతాలతో
మానవతా హృదయాలను
సుమనోహరం చేయాలి!!

## మౌనరోదనం!

చివికిన జీవితం పుటలు
  ఎండిన పూరిగుడిసె ఆకుల్లా
రాలుతూన్నాయి!
రాలే సమయంలో
అవి ధ్వనిస్తున్నాయి
కుక్కిమంచంలో తెగిపోయిన
త్రాళ్ళలా నిట్టూర్పులు విడుస్తున్నాయి!
వరదతీసిన పిదప గోదారి లంకలు
వెర్రగా బావురుమంటూ బీటలువారి
గోదారితల్లిని తిట్టలేక భూషిస్తున్నట్లు
బ్రతుకుపర్రలో దీర్ఘయాత్రలో
ఒయాసిస్సుకై పెదవులు ఆడించి
కనులు బిక్కరించి, చివుక్కుమన్న
మనస్సు శాపనార్థాల పనసలు
వల్లిస్తూంది-జీర్ణించుకోలేని
వాడి ఆకలికిటికీ ఆవులింతలా!
ఆత్మహత్యకు తలపడిన
మోసపోయిన పడుచుపిల్ల
అస్థిపంజరం నవ్వుతూంది!
అధైర్యం తిని బ్రతుకీడుస్తూన్న
అమ్మచాటు బుల్లోడిని చూసి-!
శ్మశానంమీద నక్షత్రం రాలిపడింది!
ఊరుమీద తీతువు అరుస్తూంది!

తిండిలేక అకాలమరణం
పొందిన నిరుద్యోగి భవిష్యత్తులా,
గతం చరిత్రను తలచుకొని
ఆకలి ప్రేవులు
అరుస్తున్నట్లు,
చిగురించే వృక్షాల గత దృశ్యాన్ని
తలచుకొని-రాలిపోతూన్న
కొమ్మలను పరికిస్తుంది।
పాలులేని స్తన చుంబనంలో
పసిపాప చిరుపెదవి
నవ్వడం మరచిపోయి
అమ్మ దుర్గతికి
మౌనంగా రోదిస్తుంది।।

# ఇంద్రచాపం

నీ మౌనం వెన్నెలగా
  కరుస్తున్న వేళ,
ఈ జనం మనల్ని
పిచ్చిగా చూస్తున్న వేళ,
మల్లెలు మనకోసం
ఎదురుచూస్తున్న వేళ,
నీ గుండెగుహలో చోటుకై
నేను తపిస్తున్న వేళ,
నా కనుపాపలో
నీ కనుబొమ్మ నవ్వుతున్న వేళ,
నీ సాటివాళ్లు నిన్ను చూసి
ఈర్ష్యపడుతున్న వేళ
నా సాటివారు నీపై
అక్కసు కక్కుతున్న వేళ
వెర్రివాడిలా వెతికాను
ఈ జనం హృదయంలో
మంచితనంకోసం
మనిషితనంకోసం
ఈ మనుషుల మనసుల్లో
మల్లెపూల తెల్లదనంకోసం
వెన్నెల చల్లదనంకోసం:
వెన్నుమీద సంపెంగపూవు
రాలిపడిన భ్రమ

చూస్తే ఆదరణలాంటి
నీ చల్లని చెయ్యి!
ఈ పిచ్చిలోకాన్ని శపించి
నన్ను నీతో ఆహ్వానించిన
పువ్వులాంటి నవ్వు
లాంటి నువ్వు!
అందుకే అడుగుతున్నాను
గోదారిలా విద్యుత్తులా
వెన్నెలలా పూవుల సౌరభంలా
అమృతంలా-వసంత
సమీరంలా కిలకిలా గలగలా
నన్ను రమ్మన్న ఆహ్వానంలా
కలకలా కిలకిలా నవ్వు!
ఆలస్యం చేయకు-
ఇంద్రచాపంపై
నాతో మరో ప్రపంచానికి
సాగిపోడానికి
సిద్ధంగా సంసిద్ధంగా
ఉండు నువ్వు!
అంతదాగా ఆపేయకు
నాకోసం ఆ నవ్వు!!

## బ్రతుకుపంజరంలో సామాన్యుడు

గరళాన్ని మ్రింగిన శివయ్య
దేవుడై నిలచాడు।
మూడుకళ్ళ పార్వతీ ప్రియుడు
నిటలాక్షుడై వెలిగాడు।
బ్రతకలేని దానయ్యలు
బ్రతుకులేని సోదెయ్యలు
విషం మ్రింగి చస్తున్నారు।
ఆత్మహత్యా నేరంలో
చిక్కుకుంటున్నారు।
అనేకమంది వింత
శిశువుల్ని కంటున్నారు।
మూడు కళ్ళూ నాలుగు చేతులూ
ఉన్నవాళ్ళు దేవుళ్ళు
కాలేకపోతూన్నారు।
మనుషుల్లా బ్రతకలేక
పురిటిసంధిలో ప్రాణాలు
వదులుతున్నారు।
సామాన్యుని గుండె
లయతప్పక నృత్యం చేస్తూంది।
ఆకలి సంగీతం మీటుతూ
ఈ పాడులోకాన్ని శపిస్తూ।
నిండు గోదారికి జడిసి
దూరంలో బ్రతుకు భద్రంగా

ఉంచుకొన్న సామాన్యుడు।
ఎండిన ఇసుక
పర్రపై చెడుగుడులాడుతున్నాడు।
కనిపెంచినవారికి
బ్రతికే ఉన్నాననిపించాలని,
ప్రియురాలి పయ్యెద రెక్కలో
కోర్కెలు ఆడుకోవాలని
వయసు వెర్రిగా చూస్తూంటే
ఎండిన గుండెల ఎముకలు
గరుడపురాణం వినడానికి
దున్నపోతువాహనం ఎక్కడానికి
అయిష్టంగా 'ఇష్టం' అంటూంది।
సామాన్యుని బ్రతుకు
విపర్యాల పంజరంలో చిక్కుకుని
అప్పుల కార్ఖానాలో
సమ్మెట దెబ్బలు తింటూంది।
సామాన్యుని బ్రతుకు
పంజరంలో నిరాశ
ఆశగా చూస్తూంది।
దురాశాపరుల పన్నాగాల
పన్నగాల ఫణినీడలో
అడవిలా ఆవలిస్తూంది
చిక్కిన, చవికిన సామాన్యుని
అస్తిపంజరం।
నేటి సామాన్యుని
బ్రతుకు పంజరం॥

## భవిష్యత్క్రాంతి

లక్ష అపనిందలను భరించి
ఒక మంచి కార్యం సాధిద్దాం!
కోటి కత్తుల వంతెనలను అధిగమించి
స్వర్గద్వారము తెరుద్దాం!!
ఒక్క జ్యోతిని ఆహ్వానించి
కోటి జ్యోతులు నవ్విద్దాం!
కోటిజన్మ లెత్తైనా
మనిషి జన్మ సాధిద్దాం!!
కడివెడు విషం మ్రింగైనా
గరిటెడు అమృతాన్ని పంచుదాం!
గతమంతా నిశీధి అయినా
భవిష్యత్తుకు వెలుగులు అద్దుదాం!!
బీడుపడ్డ పాతతోటలో
నవ్యసాహితీవిత్తులు చల్లుదాం!
మొగ్గతొడిగిన నందనంలోంచి
అభ్యుదయ మందారాలు
అలంకరించుకొందాం
వేయిపూలు పూయించుదాం
వేయిపరిమళాలు పొంగించుదాం
అందుకై కలిసి కట్టుగా
మహాప్రస్థానం సాగిద్దాం!!

# కవితాప్రభంజనం!

ప్రజాళిని రసస్రోతస్వినీ
తరంగాలపై ఉయ్యాలలూపి,
ఆనందపారవశ్యంలో
ముంచెత్తాలి నీకవితాసుందరి
అలంకరించుకొన్న మల్లెల
సుమసౌరభాలు।
సింగారించుకొన్న విర
జాజుల నందనాలు।।

జనావళిని ప్రేమరసాస్వాదనా
తరంగాలపై విహరింపజేసి
స్వర్గలోకానందమండలాలలో
మైమరపించాలి నీ కావ్యకన్య
వినిపిస్తున్న హృదయవీణానిక్వాణ
అందిస్తున్న ప్రేమ
పారిజాత కుసుమాలు।।

జగతిని మానవ మహోన్నత
ధర్మపథాలలో నడిపించి,
సరిహద్దులలో విలపాలి,
నీ కవితా విప్లవనాదం।
నపతా మమతా యువతా
జగతీ సహోదరస్వామ్య

విశ్వవిజయ కళ్యాణోత్సవాలకు
నీ నవకవితా సుందరి
సౌందర్యోపాసనకు
నవకవీ! యువకవీ! ప్రజాకవీ
నువ్వు తిరిగి ధరించాలి గాండీవాన్ని!
వినిపించాలి ప్రళయ ప్రభంజనాన్ని!!

# కవిత జీవితం కంటే...

నిజమైన కవిత
జీవితంకంటె కనీసం
ఒక్క గంటైనా
ముందుంటూ నడవాలి
(మాయ్‌కోవస్కీ)
నిజమయిన జీవితం
కవనంలో సత్యంలా
ఉదయాన కోడికూతలా
ఉదయార్కుని తొలికిరణంలా
లోకాన్ని మేలుకొలపాలి!
కవి కవితలతో
సౌధాలను నిర్మించలేకున్నా
సౌధాలలోని జీవులలో
ఆలోచనలు రేకెత్తించాలి!
ప్రజల భాషలో కవితలల్లడం
గొప్పకు భంగం అనుకొంటే
కవిత్వం మానెయ్యాలన్న
రవీంద్రుని మాట పాటించాలి!
అరటి ఆకుమీద అధికారం
చెలాయించిన ముల్లు
చిన్నినిప్పురవ్వకు దాసోహం అంటుంది
అమాయకుల జీవితాలతో
సౌధాలుకట్టి రాజ్యాలు
ఏలినవారికి
స్మశానంలో జీవితం ఒకే ఒక్క క్షణం!!

# ప్రకృతి చిత్రం

నీలిమేఘాల పరదాలు
   నీలిగగనాన మేఘాలు
నీలాకాశంలో విడిచిన
నీలిరంగుపూల బాలలు
మేఘానికీ మేఘానికీ మధ్య
నక్షత్రాల గొలుసులు
ఉయ్యాలలో ఊగుతూన్న
ప్రకృతి బాల!
ఊపుతూ పాడుతూన్న
ప్రకృతి కన్య!
ఆ పాటలో కోటి కోటి
పూలబాలల చిరునగవుల
సౌందర్యాలు!
ఆ నక్షత్ర గగనసీమ
మనోహర పీఠంపై
ప్రగతి కన్య చేస్తున్న
బ్రహ్మ స్వరూప సాక్షాత్కార
నృత్యవిన్యాస ప్రదర్శనం!
నృత్యానికి అలంకరణగా
వెలుగుల ఇంద్రధనస్సు అద్దుతూన్న
రంగు రంగుల రంగరింపులు
రంగానికి రంగానికి సూచనగా
మేఘాల తెరలు!

## ప్రకృతి చిత్రం

సంగీతం వినిపించే
మెరుపుల లయవిన్యాసం।
ప్రకృతిమాత కనిపిస్తుంది
నిండు చూలాలిలా।
నల్లగా మేఘాలు
ఆసుపత్రికి చిహ్నంగా।
తెల్లని మేఘాలు
నర్సుల్లా పరుగులు।
నక్షత్రాల మెరుపులు
వైద్యుల హడావిడిలా।
కెవ్వుమన్న కేక
నిండైన నిశ్వాసం
వెలుగు కిరణాలు
ప్రసరిస్తున్న సమయం।
ఉషోదయంలాంటి నవ్వు
అపుడే వికశించిన పువ్వు
పాప జన్మరహస్యానికి గుర్తు।
కోడికూసిన గుర్తు
ఆవు అంబా అన్న అరుపు
సూర్యుడు గ్రామంలో
ప్రయాణం ప్రారంభించిన ఉదయం।
చెరువుగట్టు మీంచి
చేల మీదికి ఆకాశం
దిగివస్తున్నట్లు భ్రమ।
నింగినుంచి నేలకు

చంకన పాప నెత్తుకుని
ప్రకృతికాంత పేరంటానికి
వస్తున్న దృశ్యం!
పైరుచేల పయ్యెదతో
పసిడిపూల రవికతో
బంతిపూల ఓణితో
నవ్వినట్లు గుర్తు!
అది ప్రకృతి అద్దిన అలంకారం!
ప్రకృతి నాలో కలిగించిన
సౌందర్య వివేచన!
ప్రకృతి చిత్రం!!

# తొలకరి నవ్వు

వికసించిన పువ్వు నా జీవితం।
అభ్యుదయం కోరు నా జాతకం॥
నా జీవితానికీ
నా జాతకానికీ
వికసించిన పువ్వులతో
విడువలేని స్నేహబంధం
విచ్చిన కలువల చందం।
నా స్నేహం వికసించిన పువ్వు।
నా భావం తొలకరి నవ్వు।

కలిమిలేముల మధ్య
విరిగిన హృదయాలకు
వేసారిన జీవాలకు
కంటిముందు ఇంటియందు
కురియించును నవ్వు।
వికసించిన పువ్వు।
నా స్నేహం వికసించిన పువ్వు।
నా భావం తొలకరి నవ్వు।

నవ్వుల పువ్వుల మదిలో
నా ఘంటపు కవితాఝురిలో
కనుపించును ఒకటే మొలక,
వినిపించును ఒకటే కదలిక।
నా భావం వికసించిన పువ్వు।
నా భావం తొలకరి నవ్వు।

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA D.P.R.I.
Acc. No.

## హృదయోన్మీలనం!

దీపం నీతో మాట్లాడాలని ఉంది!
నీలోని కాంతి రహస్యాన్ని
అవగతం చేసుకొని
నాలో క్రాంతిని ప్రతిష్ఠించుకోవాలని ఉంది!

వెన్నెలా నీలో కలవాలని ఉంది!
నీలోని ఆ చల్లని కిరణాల రహస్యాన్ని చదువుకొని
నాలో ప్రదీప్తం చేసుకోవాలని ఉంది!
అది అందరికీ విందుచేయాలని ఉంది!

ప్రకృతీ నీతో ఆడుకోవాలని ఉంది!
నీ ఆనంద వటీతీరాల సుగంధాన్ని
ఆలింగనం చేసుకోవాలని ఉంది!
నాలో సౌందర్యరూపాన్ని అద్దుకోవాలని ఉంది!
నీ ఆకృతిలో నీ ప్రకృతి
అందరికీ చూపాలని ఉంది!!

# శమయతి పరితాపం

అన్యాయాలు చేస్తూ మానవుడు
తను అన్యాయాలు నశించాలంటాడు
తను లోకాన్ని మాటలతో నమ్మించ గలిగినా
తన హృదయాన్ని ఎలా నమ్మిస్తాడు?
రాత్రి చీకట్లను సూర్యుడు
నిర్మూలించలేక పోయినా
చంద్రుడు మాత్రం త్రోసివేయగలడు!
కొందరు చచ్చేదాకా లోకాన్ని
దోచుకుతింటారు.
కొందరు చచ్చేదాకా ధనాన్ని
దాచుకు తింటారు!
కొవ్వొత్తి తను కాలిపోతున్నా
లోకానికి వెలుగులు వెలార్చుతుంది.
సూర్యుని వేడికి నెత్తి కాలుతూన్నా
చెట్టు తననీడ నాశ్రయించినవారికి
ఎండను తగలనీయదు!
మనిషిలో మంచితనం
మనీషిగా మార్పు చెందిస్తే
మనస్సులో తమస్సుకు
చోటు దొరకదు!
చుర్రుమనిపిస్తూ సూర్యుడు ఉండగా
చీకటి ఎందుకు ఉంటుంది?

## కాపీ రైట్

నిజం నిప్పులాంటిదనీ
 ఇది అందరికీ చేదుగా
ఉంటుందని తెలిసీ
పలుకుతున్నాను గొంతెత్తి!
పాటగా రాస్తున్నాను కలమెత్తి!!

నువ్వనుకొన్న స్వాతంత్ర్యం
మేం ఇంకా సాధించలేదనీ,
కులమతాల, ప్రాంతీయాల
గ్రూపుల ఇనుప కచ్చడాలలో
అది బందీ అయే ఉందనీ,
ఛత్రాజుల పొగడ్తల
ముత్యాల పల్లకీలో
నిన్ను ఊరేగిస్తున్నారనీ,
నువ్వు ఆశించిన
 'అందరికీ స్వాతంత్ర్యం'
కొందరే అనుభవిస్తున్నారనీ,
మిగిలిన అందరికీ నీమీద
ఆశ ఇంకా మిగిలే ఉందనీ-
అందుకు సాక్ష్యంగా
వజ్రోత్సవ చిహ్నంగా
మొగలాయ్ దర్బార్ని
లక్షలు వెచ్చించి అలంకరించామనీ!

మామాటగా ఈనాటి మా ప్రగతి
కతగా ఈ పాట వినిపిస్తున్నాను:
మహాత్మా! నీ ఆత్మ పడుతూన్న క్షోషకు
మేం కారకులమని
చెంపలేసుకొంటున్నాము:
అందుకు పాపపరిహారంగా
తామ్రశాసనాలు దేవభాషలో
పంచిపెడుతున్నాము:
మా ఆశయాలకు
ధోకా లేకుండా
నీ పేరుమీదుగా
ఉత్సవాలు జరిపిస్తున్నాము:
నీ కీర్తి ప్రతిష్ఠలను మావిగా
ప్రచారం చేసుకోడానికి
కాపీరైట్ రాసుకొంటున్నాము::

# శిల్పి

తాను చెక్కు
    కఠిన శిలకు
కరుణరసం జొప్పించును;
తాను రాయు
కావ్యాలలో
పరమార్థం పూరించును;
తాను కట్టు
గుడిలోపల
దేముడినే బంధించును;
దివ్యతనూ నవ్యతనూ
తన ఉలిలో రూపించును;
తనవలెనే
శిలలోపల
శృంగారం చిగురించును;
తనవలెనే
శిలలోపల
శ్రీకారం పలికించును॥

# అగ్నిలా నవ్వు

ఆకలిగొన్న బెబ్బులిలా
విరుచుకుపడు।
నీళ్లాడిన సింహంలా
ఒళ్లంతా పళ్లుచేసుకొని అరు॥
స్తనాలపై నిలచి
కళ్లతో వలచి
కాల్యా లన్నింటినీ
దుర్వాసన కొట్టించిన
రుద్రాక్షల యాజమాన్యంపై
ప్రళయంలా, విలయంలా
అగ్గిరవ్వలు విరజిమ్ము।
అగ్నివీణ వినదించు॥
ఒకరి కోసం పదిమంది
చావాలనే స్వార్థంపై
పదిమందినీ కట్టుకొని
ఒక్కడుగా ఏకచ్ఛత్రాధిపత్యపు
అహంకారంపై
అరణ్యంలా గర్జించు।
అగ్నిలా కణకణమని వెలుగు।
జ్వాలపై భగభగమని మండు॥

ఈ దారుణమారణ హోమంలో
మసి కాకుండా నుసి కాకుండా

అభాగ్యులకై అనాధలకై
అండగా నిండుగా దండవై
ప్రళయకాళ రుద్రుడవై
పరుగిడు!

## ఆత్మాన్మీలనం

వెన్నెల వర్షం లోపల
కన్నెల హాసం లోపల
పూవుల నృత్యం లోపల
పాపల చూపుల లోపల
చూడగలను ప్రగతి పరీమళం!
చూడగలను భావమహార్ణవం!!
సూర్యకిరణం లోపల
జ్వాలా తోరణం లోపల
గోదారి తరంగం లోపల
మృదంగనాదం లోపల
చూడగలను క్రాంతి పథం!
చూతును సంక్రాంతి పథం!!
కర్షక శ్రమ ఫలితంలో
కార్మిక శ్రమ ధర్మంలో
అనాధల ఆర్తనాదంలో
అభాగ్యుల హాహాకారంలో
వినగలను విప్లవగీతం!
చూడగలను ఝంఝూ మారుతం!!
నిప్పులాంటి నిజం
నీళ్లపై నడిచేప్పుడు
చెమట తడిపిన శ్రమ ఫలితం
అందరిదీ అయినప్పుడు

శ్రీకారానికి సీమంతం చేయగలను।
ఓంకారం ప్రతిగుండెలో పలికించగలను॥
ఈ కల ఈ భావన
నిజమయ్యేందుకు
ఈ కలం హలంతోనే
ప్రగతి కవిత రాస్తాను।
ప్రజా కవిత రాస్తాను॥

## అక్షయభావ లహరి

రగిలించకు గుండెలలో
  అగ్నికుండం
పగిలించకు కపాలాలు
నవతాహృద్ మందిరంలో
జ్యోత్స్నావళి తోరణాలు।
కట్టగ మ్రోగించుము
మానవతా మంజీరాలు।
మనిషిలోని పశువును
వెలివేయుము వెలికినెట్టి।
మనసులోని మనిషిని
మనీషిచేసి నిలబెట్టుము।
నినదించే ప్రతి పలుకున
ప్రగతిపూలు పరిమళించ,
పలికించే ప్రతిపాటను
శాంతివీణ వినిపించగ,
అక్షరతూణీరాలతో
నవభారతి తీర్చిదిద్దు।
అక్షయభావలహరితో
నవతాపథాలు దిద్దు॥

## ఓంకారం

ఓంకారం ఓంకారం
    ఓంకారం పలకండీ!
పలకండీ పలకండీ
ఓంకారం పలకండీ!
భయం భయంగా
బ్రతుకులు ఈడ్చే
అర్ధనగ్నముగ
రోజులు గడిపే
అర్థాకలితో
ఎముకలు నింపే
జనానికంతా, జగానికంతా
మోక్షపథం చూపేటందుకు!
ధనరాబందుల రెక్కలుకట్టి
దుర్మదాంధులను దునిమేటందుకు
ఓంకారం ఓంకారం
ఓంకారం పలకండీ!
ప్రపంచానికి
మేలుకొలుపుగా
ప్రభంజనాన్ని రేపండి
ఓంకార ధ్వని
తరంగాలలో
విప్లవాగ్ని
రగిలించండీ!

ఓంకారపు ప్రతి
పదార్థాలతో
ప్రళయాగ్నులు కురిపించండీ!
మీ రాజ్యం
మీరేలేటందుకు,
మన రాజ్యం
మనదయ్యేటందుకు,
స్వాతంత్ర్యం
సౌభ్రాత్రం
అందరికీ
పంచేందుకు
జనస్వామ్యపు
లాభాలను
ప్రతి మనిషికి
అందించేందుకు—
అగ్నివీణ మీటి
క్రాంతిగీతాలను
పాడండీ!
శాంతివీణమీటి
ప్రజకు సంక్రాంతులు
నిలపండీ!
ఓంకారం ఓంకారం
ఓంకారం పలకండీ!
పలకండీ పలకండీ
ఓంకారం పలకండీ!!

## సప్తస్వరాలు!

చీకటి ప్రసవించే సమయం ఇది:
  వేకువ ఉదయించే క్షణం ఇది::
వేయికళ్ళతో వేయి భావాల
ఆశల ఆశయాల ఆరాధనల
ఫలితంగా జనం ఎదురుచూసే
దివ్యదినం ఇది:
నిన్న చీకటిని చూసి
జడసుకున్నవాడు,
నేడు చీకటిపై
పిడికిలి బిగించి
వెలుతురుకై వేయి బాణాలు
విసరి జబ్బ చరుస్తున్నాడు:
చీకటి వాకిట నిలువరాదనీ
చీకటి గుండెలో ఉండరాదనీ
చీకటి రాజ్యం ఏలరాదనీ
చెల్లు చీటీరాసి నిబ్బరంగా
నిర్భయంగా క్రాంతిచ్ఛటలు
గుప్పిస్తున్నాడు:
కాంతిపతాకాలు ఎత్తుతున్నాడు:
భవిష్యత్తు పొలిమేరలో వేకువ
నవ్వుతుందన్న నమ్మకంతో
మానవతా మహాయజ్ఞ వాటికలో
విశ్వశాంతి విరుస్తుందన్న

కొండంత ఆశతో
చీకటి గుయ్యారంలో
వేకువ గొంతువిప్పి
సమతా శంఖాలను
వినిపిస్తుందనే ధీమాతో-
నమ్ముతున్నాడు, ఆశయాలు
నింపుకున్న మానవుడు!
భావిమానవాళి నివాళి
అందుకొనే దేముడు!
ఇది నిజం మారుతుంది ఈజగం
ఇది నిజం మానవుడా
భుజం కలిపి కదులు గజంగజం
కలుగు కడకు నీకే జయం!
చీకటి నాగరికతపై కప్పిన
కబంధ అధికార హస్తాల చిహ్నం!
దీనిపై జనం ఉరికి ఉరిమిన
చప్పుళ్ళ సంకేతం దీపావళి!
నరకాలూ నరకాసురులూ లేని
స్వర్గాలూ, రాకా సుధాకరకీరాలూ
అందించే రేపటికై
ఈ చీకటిని, త్రుంచెయ్, అందుకై
రకరకాల ఆయుధాల సరంజామాతో
టపాసులు కురిపించు!
చీకటి వాకిటిలో వెలుగులు వెలార్చు!
బానిస బ్రతుకుల్లో
స్వాతంత్ర్యం పండించు!

ఉదయించిన వేకువలో
వినిపించు దివ్య దీపావళీ
సందేశాలు!
కాంతికై మ్రోగించు
క్రాంతి ప్రభంజనాలు!!

# చేదు మందు

న్నన్ను నిద్రపోనీ!
  నిప్పును నివురు గప్పినట్లే
ఉండనీ!
నిజాన్ని బలవంత పెట్టకు
చేదుని మ్రింగి
ఆరోగ్యం కాపాడుకోమని!
కాళిని పూజించు
పూజారితో తలపడకు!
అమ్మవారి నాలుకపై
కాళీయమర్దన నృత్యం
చేయకు,
ఆ అమ్మని నిద్రపోనీ
అలా ఉండనీ!
అడవిలో పులిని లేపకు
లేపి లేడిని బలివ్వకు,
వేడి నెత్తురును
వృథా చేయకు!
అనుమానాల సహారాలో
పచ్చగడ్డి మొలిపిస్తానని
బాబాల గారడీలా
ఊరించి, లోకాన్ని
నమ్మే అమాయకత్వాన్ని
ఊచకోత కోయకు!

నీటిమీద నడిచి
ఈ రోజు గడిచి
నిప్పుమీద పరుండి
రేపు చూస్తానని
ఆకాశం అంచున నిలచి
స్వర్గంలోకి తొంగిచూస్తానని
చిలుక జ్యోతిషం పలుకకు:
నన్ను నిద్ర లేపకు:
నాకు తెలుసు
ఈ ప్రయాణం
ఇంకా ఉందనీ,
ఇంతటితో
ఆగేది కాదనీ:
ఈ ఉదయానికి
ఇంకా ఘడియలెన్నో
జరగాలని,
అరుణోదయానికి
భవిష్యత్తు
దగ్గరలోనే ఉందనీ::

## "ఆనోభద్రాః...."

నేను చేస్తాను యజ్ఞం!
శాంతికై, విశ్వశాంతికై
కాంతికై జగతి విక్రాంతికై
నేను చేస్తాను యజ్ఞం!!
అశాంతి నిహతికై
ధర్మనిరతికై
నేను చేస్తాను యజ్ఞం!
'పక్వాన్న మివభోజ్యేన....' అన్న
కామసూత్రాలు ఖండిస్తూ
ఇహానికీ పరానికీ ఇజాల
గారడీలు వద్దంటూ
నేను చేస్తాను యజ్ఞం!
నా యజ్ఞానికి ఋత్విక్కులు
నానాజాతి మానవులు!
నాయజ్ఞ సమిథలు
బూతుపురాణాలకట్టలు!
ప్రజలలో అశాంతి పోవాలనీ
ప్రపంచంలో సుభిక్షం పండాలనీ
కార్మికుడూ, కర్షకుడూ
యువతా నవతా ఒకచో చేరి
ప్రజాస్వామ్య జగన్నాధ రధానికి
సమతా తోరణాలు కట్టి
శుభోదయ నాదస్వరం వినిపించాలనీ
నేను చేస్తాను యజ్ఞం!!

# నిప్పుపూల పరిమళం

భూతద్దం సూర్యకిరణాలను
కేంద్రీకరించిఅగ్గిరవ్వలుపుట్టించినట్టు
పూవు పూవునీ ఆస్వాదించి
తేనెటీగలు మధువును
పట్టుగా ఆవిష్కరించినట్లు
చిప్ప చిప్పనీ చినుకు ఆహ్వానించి
ముత్యాలు హారాలను వరించినట్లు,
చినుకు చినుకు ఏకమై
వాగై వరదై సముద్రాన్ని ఆవహించినట్లు
అణచబడిన ప్రజలలో
వినిపించే నిరాశలు
విప్లవ ఉఛ్వాస నిశ్వాసాలుగా
మారి గుండెల్లో అగ్నిగానం
ఆలపిస్తున్నట్లు.-
ఇది కలకాదు-కథకాదు
రాయనున్న కొత్త చరిత్రకు
జరుగుతున్న ప్రస్తావన-అని:
కాల మహా గానాన్ని విప్లవ
సందేశంతో శ్రుతి కలిపి
మీటుతూన్నట్లు,
యువత ప్రజల బ్రతుకు
పాటల పునాదిపై
క్రాంతి కిరణాల తంత్రుల మహతిని

రక్తాక్షర సంకేతాలతో
ప్రగతిని పిలుస్తున్నట్లు,
వినిపిస్తుంది సముద్ర
ఘోషలో,
అనిపిస్తుంది వీస్తున్న ఝంఝుంలో,
కాలుతూన్న కడుపు
రణగణ ధ్వనిలో
కరుస్తూన్న చంద్ర నిప్పుల
చెడుగుడులో
ప్రజా కవిత విప్లవాగ్నిని
రాజేస్తూన్న
సుముహూర్తంలో
నిప్పుపూలు విరబూయ గలవనీ,
అగ్నివీణ మ్రోగ గలదనీ,
కత్తుల బావుటా పావురాయిని
ముద్దెట్టుకోగలదనీ!!

## నరుడు—నక్షత్రాలూ

కాలధర్మం కాలానుగుణంగా ఋతుధర్మాను సారంగామారుతూ,
ప్రకృతి చిరుపెదాల దరహాసరోచిర్నివహాలమీద నిలబడి,
ప్రశ్నిస్తూంది - నరుడ్ని-ఆధునికమానవుడ్ని!
కాలరేఖలమీద నిలబడి కాలాన్ని ఆజ్ఞాపించడానికి
ప్రకృతిని పిలిచి హృదయం విప్పి మాట్లాడడానికి
ప్రకృతి కనుకొలకుల నీలినీడల్లో విడిచి విప్పారిన సుమాల
పెదాల సుందరస్వప్నాల కెరటాలకొనలమీద
నిలబడి ప్రశ్నిస్తూంది-మానవుడ్ని!

ఋతువులుమారవు, ఋతుధర్మాలుమారవు
ఋతువుల ఆశయాలు రాజకీయనాయకుల
ఎన్నికలపార్టీ ఫిరాయింపుల్లామారవు.
కాలం మారుతున్నట్లుగా అగుపించేది
మనిషి ఊహాంచలాల స్వప్నసీమల
నవ్వులపంటల తీరాలలో-దూరాలలో!
కాలంకత్తులవంతెనలా ఊహించుకొని
కాలానికి సంకెళ్లువేసి, కాలరేఖలను
మానవతావాదానికీ, ప్రకృతిధర్మానికీ
విరుద్ధంగా మలచుకొనే మానవుడా
నీనీడలు నీకన్నా పెద్దవని నిన్ను నీలో కొలుచుకొని
నీకు నీవే తలచుకొని,
ధర్మాధర్మవిచక్షణకు పూనుకోడంలో
వెలుగునీడల తూనికల హెచ్చుతగ్గులు గమనించు,

కాలంచెప్పే అనుభవాలపాఠాలు బాగా జీవితానికి పట్టించి,
బ్రతుక్కి జీవనరాగాల పరీక్షలో
శ్రుతి, లయతప్పని జవాబుల పేపరురాసి,
గతానుభవాలగైడ్‌తో సరిచూసుకో!
వర్తమానగానాలను ఆలకించి భవిష్యత్
చరణాలకు ఎర్రని పారాణిని అలంకరించి,
ఆశలజరీతో ఆశయాల ముగ్గులతో
ఆనందాల చలువపందిరినీడలో
కొత్తపాటను పలికించి - సరి
కొత్తరాగాలు మీటించి,
కాలరేఖలమీద గర్వంగా నిలచి
గగనానకోటికోట్ల తారకలతో
నీప్రగతిసౌధాన్ని ఆవిష్కరించు!

పదిమందినీ నవ్వించేందుకు
నీ సాహితీవనభోజనం విందులో
నవతను వడ్డించి, మమతలక్షీరాల
విందులతో జనతను కదిలించు!
ప్రతిగుండెలో కోటికోట్ల నక్షత్రాల
ట్యూబ్‌లైట్లతో వెలుగుల దివ్వెలతో
నృత్యంచేయించు - ప్రతి దివ్వెనూ
క్రాంతి కిరణంలా రగిలించు!!

## కవితా మౌక్తికాలు!

శతసహస్ర శరత్తుల చాంద్రీయ
  సాంద్ర రజనీ రహస్సులందు,
శతకోటి వసంత రాగాల
అనురాగ హృదయగీతాలయందు,
శరదృతువులో మల్లెల గుండెల
గుసగుసల ప్రేమవిన్యాస ఉషస్సులందు,
నా కవితకు కల్యాణ తిలకం అద్ది
ఆ కళ్యాణ కవితా కింకిణిని
విశ్వకళ్యాణ వేదిగా నిలిపి
మానవమహోదయ రోచిస్సుందర
దరహాసచంద్రికా స్వప్నవిజయాల
పచ్చతోరణాలతో
పాడించగలను గుండె కమ్మని పాట!
ఆడించగలను ప్రతిగుండె నట్టింట
నెలవంక నవ్వుల నాట్యాలశోభ!
సంక్రాంతి సందేశకవితగా
తెలుగునాట—ఈపూట!!

## ఈ జ్ఞాపకాలు ఈ నాటివి కావు

ఊరు చివర ఏరు
గుడి పక్కన తేరు
పక్కనే మా ఊరు!
నాకు బడిఅంటే భయం
నాకు ఆ గుడి అభయం
నాకు గురువంటూ లేడు
ఉన్నదల్లా ఆ ఒక్కదేవుడు
గుడిలో నన్ను ఆదరించే వాడు?

ఊరిమధ్యన మా బడి
క్లాసుకీ క్లాసుకీ మధ్యన దడి
నేలంతా తడి
మాస్టారి కుర్చీ మడి!

నాకు మాస్టారంటే భయం
ఆయన చేతిచింత బరికంటే భయం
ఆయన ఆకలితో నిద్రపోయేవాడు
మేం మామిడికాయల కోసం చెట్టెక్కేవాళ్ళం
పాఠాలు ఎప్పుడూ చదవలేదు
చదివిన పాఠాలు బ్రతుక్కి
పనికి రాలేదు,
ఆ గురువు ఉన్నారో లేదో
ఆ బడి ఉందో లేదో
ఆ గుడి ఉందో లేదో

ఆ గరువు ఉందో లేదో
నాకు తెలియదు
కాని ఆ ఊరు ఉంది
ఆ ఏరు ఉంది
మా గరువు ఉంది!

ఊరి వీధుల్లో వేదాలు
వినిపించేవి
ఊరి చెరువు గట్లు
కావ్యాలు చెప్పేవి
ఊరుపేరు చెబితేనే
ఋషులు కనిపించేవారు
ఆ ఊరికి ఆ ఏరు
ఒక ఫలం
ఆ జనానికి ఆ గుడి
ఒక శాపం
ఆ బడికి చింతబరికెలు
శరణ్యం!

ఏమైనా ఆ ఊరు గొప్పది
ఆ ఏరు గొప్పది
మేం వెన్నెల సెల ఏటిలో
కాగితం పడవలు కట్టి వదిలి
రేపటి స్వర్గానికి
రాయబారాలు పంపేవాళ్ళు!
రేపటి వసంతానికి
ఆ పడవల్లో ప్రగతి భావాలను

ఎగుమతి చేసేవాళ్ళం!
మా చిన్ననాటి చిలిపి పనులను
పిచ్చి పనులుగా నవ్వేవారు
మా పెద్దవారు మమ్మల్ని
తిట్టేవాళ్లు
మా గురువు మమ్మల్ని
బరికెతో బర్రెలా బాదేవాళ్లు!
అయితే ఆనాటి మా ఆటలు
నేటి బ్రతుక్కి బాటలు వేశాయి!
రేపటి స్వర్గానికి కవాటాలు
తెరచాయి!
రేపటి వసంతానికి
స్వాగతం ఆలపించాయి!
అనుభవాల అనుభూతుల
గత జీవిత ప్రయాణాలే
వర్తమాన జీవిత నౌకకు
వెలుగు తెరచాప అయింది!
భవిష్యత్ ప్రగతికి
వెన్నెల సోపానం అయింది!!

NARLA MEMORIAL LIBR
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

## శాంతీ!


శాంతీ!
ఈమధ్య నీజాడ కనిపించడంలేదు,
నీ చిరునామా తెలియడంలేదు,
నిన్నుగురించిన వివరాలు వినిపించడంలేదు
ఒకనాడు నీ మాట ప్రతి నోట
ప్రతి పేటనా వినిపించేది
నీకురాసే ప్రతి ఉత్తరం
తప్పకుండా నీకు అందేది!
ఈనాడు ఎక్కడున్నావో
ఎందుకు కనిపించడంలేదో
ఏ ప్రాంతంతో దాగావో,
ఏజైల్లో మగ్గుతున్నావో,
ఇలా అన్నీ పాడుకలలు
నన్ను బాధిస్తున్నాయి, వేధిస్తున్నాయి!
శాంతీ!
నువ్వు అందరినీ
ఓదారుస్తూ అందరికీ
ఆప్యాయంగా ఉండేదానివి!
తుపాకి అన్నా, కత్తి అన్నా,
నిప్పుఅన్నా, నీరన్నా,
అధికారం అన్నా, మరేమన్నా
బెదరకుండా పెద్దగా
నిలబడేదానివి

మా అందరికీ ధైర్యాన్ని
గుండెల్లో చల్లదనాన్ని
ఇచ్చేదానివి!
మరి ఎందుకు కనిపించడం లేదు
నువ్వంటే కిట్టనివాళ్ళు
నిన్ను హత్యచేయ లేదుకదా?
నువ్వంటే భయపడేవాళ్ళు
నిన్ను బంధించలేదుకదా?
ఈ దేశంలో—ఏదో ఒక రాష్ట్రంలో
గాంధీపుట్టిన దేశంలో
బౌద్ధం పలికిన భూమిమీద
నువ్వు తప్పకుండా ఉంటావనీ
నీ చిరునామా కోసం రాత్రీ పగలూ
వాడలూ మేడలూ, కొండలూ కోనలూ
దేశం నలుమూలలా
గాలించాను!
నీ జాడ ఎక్కడా లేదు-
నా గుండెలో ఏదో భయం
నన్ను బాధపెడుతూంది!
నిన్ను తిరిగి ఈ దేశంలో
చూడలేనేమోనని
అనుమానంగా ఉంది!
శాంతీ!
మంటల పందిళ్ళ క్రింద
బ్రతుకీడుస్తూన్న జనాన్ని

అధికార దురహంకారం క్రింద
మూల్గులు విడుస్తున్న ఈ జాతిని,
నీతి, నియమం, ధర్మం సమాధి అయి
బ్రతుకే నిప్పులకుంపటిలా
మారిన ఈ దేశాన్ని
తిరిగి నవ్వించడానికి,
తిరిగి తల ఎత్తుకు తిరగడానికి
నువ్వు రావాలి శాంతీ
నువ్వు రావాలి!
ప్రతి గుండెలో నువ్వు
ప్రతి పల్లెలో నువ్వు
దేశం నలుమూలలా నువ్వు
ఆకులో, పూవులో - గాలిలో
జనంలో అంతటా
నీవే కనిపించాలి!
నువ్వే వికసించాలి!
నీపేరు శాంతి! శాంతి!!
శాంతి అని ప్రతిధ్వనించాలి!
రా—శాంతీ!
నీరాక బ్రతుకు భయాల
సామాన్య జనాళి గూటిలో
ధైర్యం వెలగాలి!
శాంతి వెలయాలి!!

BcI

AOUA101B108



పూల నిట్టూర్పుల్లాంటి పదా లల్లి మన కాళ్ళకు అందాల బంధాలు తగిలించగలడు. కావాలంటే భావకుంజరాల్ని శబ్ద పంజరాల్లో ఇరికించి ముగ్ధుల్ని చేయగలడు.

లోకం పోకడలను నగ్నంగా చూపించడంలో పిడుగుల వంటి పదాల వర్షం కురిపించనూ గలడు. ప్రకృతి ప్రణయ కవితల పూలజల్లుల పరిమళాలతో మత్తెక్కించనూ గలడు.

ఆధునిక కవితలో ఈ రెండు మార్గాలనూ ఒకే బాటన నడిపి 'శభాష్' అనిపించుకొన్న సవ్యసాచి ఎల్లోరా.

ఆ ఆశలకూ, ఆశయాలకూ 'రేపటి వసంతం' ఒక దర్పణం.

అభ్యుదయ సాహితీ ఎడారిలో ఎల్లోరా కవిత 'రేపటి వసంతం' ఒక నీలి ఒయాసిస్సు.

BC

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA101B108 |
| పుస్తకం పేరు | రేపటి వసంతం |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | Yes |
| వెనుక అట్ట | Yes |
| మొత్తం పేజీలు | 137 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | 2:1 BCI |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | P Jayamma |
| పేజీలు విడదీసినది | P Jayamma |
| స్కాన్ చేసినది | Nandini |
| పరీక్ష చేసినది | MADHU MATHI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | Good |